www.vishalabharati.com
epaper.vishalabharati.com

గురువారం, హైదరాబాద్
03 ఆగస్టు 2026
సంపుటి:4 సంచిక: 238

# విశాల భారతి

తెలుగు దినపత్రిక



## అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ఉతికి ఆరేస్తాం

- కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు
- రేవంత్ పాలనను "ప్రజా పీడన"గా అభివర్ణించారు
- ప్రభుత్వం అవినీతి, కమీషన్లకు కేంద్రంగా మారిందని ఆరోపించారు
- ఉద్యోగాలు, రైతులు, బీసీల విషయంలో కాంగ్రెస్ విఫలమైందన్నారు
- శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని కేటీఆర్ విమర్శించారు
- కేసీఆర్ త్వరలో అసెంబ్లీకి వస్తారని స్పష్టం చేశారు

02



## మూసీ ప్రాజెక్టుకు హైకోర్టు బ్రేక్!

- డీపీఆర్‌పై హైకోర్టు కీలక ప్రశ్న
- భూముల స్వాధీనంపై తాత్కాలిక స్టే
- హిమాయత్‌సాగర్ రైతులకు ఊరట
- ప్రభుత్వానికి కౌంటర్ దాఖలు ఆదేశం
- మూసీ ప్రాజెక్టుపై పెరిగిన ఉత్కంఠ

02



## కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ తిరుగుబాటు

- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ తిరుగుబాటు
- 420 హామీలు ఏమయ్యాయి..? ఆరు గ్యారంటీల అమలు ఏదీ..?
- ఇబ్రహీంపట్నం సాగర్ హైవేపై భారీ నిరసన ర్యాలీ
- ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి(బంటి)

05



07

## సైబర్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

- చదువుపై పూర్తి దృష్టి సారించాలి.. మొబైల్ వినియోగంలో నియంత్రణ

# 1000 రోజులు.. ఒక్క కేసు తేల్చలేదు!

### కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై విజయాల ప్రచారం




### బీఆర్ఎస్‌పై అవినీతి, అక్రమాల ఆరోపణలు

కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ కేసులు పెండింగ్‌లోనే
విచారణ కమిషన్లు, సిట్‌లపై చర్యల వేగం ప్రశ్నార్థకం
కేసులు రాజకీయ కక్ష సాధింపేనని బీఆర్ఎస్ ఆరోపణ
మిగిలిన పాలనలో కేసులు తేలుస్తారా? అన్నదే ఆసక్తి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో: ప్రభుత్వ ఖజానాను లూటీ చేసిన వారిని జైలుకు పంపుతామని, దోచుకున్న ప్రజాధనాన్ని కక్కిస్తామని భారీ వేదికలపై గర్జించారు.** పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత గత ప్రభుత్వ విధానాలపై విచారణల పరంపర ప్రారంభమైంది. ఆర్భాటంగా ప్రారంభమైన కమిషన్ల విచారణలు కాలక్రమంలో నెమ్మదించాయి. ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు కొన్ని నెరవేరినప్పటికీ, నాటి కీలక ఆరోపణలు నేడు రాజకీయ ఉపన్యాసాలకే పరిమితం కావడం గమనార్హం. రేవంత్ సర్కార్ గద్దెనెక్కగానే బీఆర్ఎస్ హయాం నాటి భారీ ప్రాజెక్టులు, ఆర్థిక లావాదేవీలపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించింది. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో మిగతా 3లో..

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తి చేసుకున్న వేళ రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారంటీల అమలు తీరుపై ప్రజల్లో విస్తృత చర్చ నడుస్తోంది. అధికార పక్షం తమ 1000 రోజుల అభివృద్ధి ప్రస్థానాన్ని ఘనంగా చాటుకుంటుంటే, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ పాలనా వైఫల్యాలను ఎండగడుతోంది. నాటి ఎన్నికల ప్రచార సభలలో పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి పదేళ్ల కేసీఆర్ కుటుంబ అవినీతి పాలనపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

## వైఎస్ శిష్యుడిని.. సీఎం అవుతా!



- తెలంగాణలో రాబోయేది వైఎస్సార్ యుగమే: కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి
- సమయం వచ్చినప్పుడు తాను కూడా సీఎం అవుతానని సంచలన వ్యాఖ్యలు
- కాంగ్రెస్‌లోకి వచ్చిన కొత్త నేతలు తమనే వెళ్లగొట్టాలనుకుంటే సహించేది లేదని హెచ్చరిక
- నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరగకుండా పోరాడుతానని హామీ
- తెలంగాణ ప్రభుత్వం సీమాంధ్రుల చెప్పుచేతల్లో ఉండకూడదంటూ కీలక వ్యాఖ్యలు
- తన నాయకుడు రాహుల్ గాంధీయేనని, అధిష్ఠానం నిర్ణయాలకు కట్టుబడి ఉంటానని స్పష్టం

02



## 50 ఎకరాల అసైన్డ్ భూమి మాయం!

- గజ్వేల్ హవాడిగూడలో 50 ఎకరాల అసైన్డ్ భూమిపై వివాదం
- రెవెన్యూ రికార్డుల్లో అక్రమ మార్పులు జరిగాయన్న ఆరోపణలు
- అధికార కాంగ్రెస్ నేతల కుటుంబ సభ్యుల ప్రమేయంపై విమర్శలు
- రైతులను తక్కువ మొత్తానికి భూముల నుంచి తొలగించారన్న ఆరోపణలు
- బాధితులకు న్యాయం చేయాలని రైతు, ఎస్సీ-ఎస్టీ సంఘాల డిమాండ్
- భూ వ్యవహారంపై స్వతంత్ర ఉన్నతస్థాయి దర్యాప్తు కోరుతున్న బాధితులు

02

## డిఫెన్స్ నుంచి అటాక్‌లోకి సురేఖ

- ఢిల్లీలో కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు
- తనపై చర్యకు బదులు సీఎం రేవంత్‌పై చర్య కోరారు
- క్రమశిక్షణ విషయంలో సమాన న్యాయం ప్రశ్నించారు
- మంత్రులు, సీనియర్లలోనూ అసంతృప్తి ఉందని వ్యాఖ్య
- సురేఖ టార్గెట్ రేవంత్ అయినా.. సందేశం హైకమాండ్‌కే
- చిట్‌చాట్‌తో వివాదం మరింత ముదిరే అవకాశం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ కాంగ్రెస్ అంతర్గత రాజకీయ వేదికపై మంత్రి కొండా సురేఖ ఢిల్లీ కేంద్రంగా వినిపించిన స్వరం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా పరిణమించింది. పార్టీ క్రమశిక్షణ చర్యల ముప్పు తనపై పొంచి ఉందన్న వార్తలు వస్తున్న సమయంలో ఆమె ఆత్మరక్షణ వైఖరిని విడనాడి ఎదురుదాడికి దిగడం రాజకీయ పరిశీలకులను సైతం ఆశ్చర్యపరిచింది. సాధారణంగా ఏ నాయకుడైనా ఇలాంటి విపత్కర పరిస్థితులలో అధిష్ఠానం వద్ద వినమ్రంగా వివరణ ఇచ్చుకునే ప్రయత్నం చేస్తారు. సురేఖ మాత్రం కేవలం మిగతా 3లో..

## హైదరాబాద్‌లో డిఫెన్స్ ఎక్స్‌పో

- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రాజ్‌నాథ్ సింగ్‌కు రేవంత్ ఆహ్వానం
- డిసెంబర్ 7–9న భారత్ ఫ్యూచర్ సిటీలో సదస్సు
- రక్షణ ఎక్స్‌పో-2026 ప్రారంభించాలని విజ్ఞప్తి
- ఎయిర్‌షో, ఏరోస్పేస్-డిఫెన్స్ ప్రదర్శనలు నిర్వహణ
- ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు 1,500 ఎకరాల భూసేకరణ
- డీఆర్‌డీఆర్ ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమి కేటాయింపు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 సదస్సుకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సాదరంగా ఆహ్వానించారు. దేశ రాజధాని ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రితో సీఎం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా డిసెంబర్ 7 నుంచి 9 వరకు మూడు రోజుల పాటు ఈ అంతర్జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నారు. సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్న భారీ రక్షణ ఎక్స్‌పో 2026ను కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా ప్రారంభించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు విశేష ప్రాధాన్యతనిస్తూ ఈ ప్రదర్శనను సిద్ధం చేస్తున్నారు. ప్రపంచ రక్షణ ఉత్పత్తుల తయారీ సంస్థలు, స్వదేశీ రక్షణ రంగ నవకల్పనల రూపకర్తలను మిగతా 3లో..



## శ్రేయస్ టీమిండియా పర్మనెంట్ కెప్టెన్

- రిటైర్మెంట్ వరకు అతడే సరైనోడు
- శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా అద్భుతాలు చేయగలడు
- అలాంటి లీడర్‌తో పనిచేయడం ఎప్పుడూ గొప్ప అనుభూతే
- టీమిండియా టీ20 కెప్టెన్సీపై రికీ పాంటింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు

**స్పోర్ట్స్ డెస్క్:** టీ20 ప్రపంచకప్ 2026 తర్వాత టీమిండియా కెప్టెన్సీ నుంచి సూర్యకుమార్ యాదవ్‌ను బీసీసీఐ తప్పించిన సంగతి తెలిసిందే. కెప్టెన్‌గానే పూర్తిగా ప్లేయర్‌గానే అతడిని జట్టు నుంచి పక్కన పెట్టేశారు. అతడి స్థానంలో అనూహ్యంగా మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌ను భారత టీ20 జట్టు సారథిగా బీసీసీఐ నియమించింది. బోర్డు తీసుకున్న ఈ నిర్ణయంపై మిశ్రమ స్పందన వ్యక్తమైంది. వరల్డ్‌కప్ అందించిన కెప్టెన్ పట్ల బీసీసీఐ వ్యవహరించిన తీరు సరికాదు మిగతా 3లో..

## త్వరలో మూడు లక్షల కొత్త పెన్షన్లు



- బీఆర్ఎస్ హయాం అప్పులు, పెండింగ్ బిల్లులు చెల్లిస్తున్నాం
- రైతు సంక్షేమానికి రూ.1.76 లక్షల కోట్లు ఖర్చు
- త్వరలో 3 లక్షలకు పైగా కొత్త పెన్షన్లు
- తొలి విడతలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
- 20 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ పైలట్ ప్రాజెక్ట్
- ఇళ్ల ఎంపికలో పైరవీలు, రాజకీయ సిఫారసులకు తావులేదు

03

## తుమ్మిడిహెట్టిపై తేలని పంచాయితీ!

- తుమ్మిడిహెట్టి బ్యారేజీపై తెలంగాణ–మహారాష్ట్ర మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు
- తెలంగాణ 152 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మాణాన్ని ప్రతిపాదించింది
- 148 మీటర్లకు మించి ఎత్తు వద్దని మహారాష్ట్ర స్పష్టం చేసింది

03



# వైఎస్ శిష్యుడిని.. సీఎం అవుతా!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



మునుగోడు శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన సంచలన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా నియోజకవర్గంలో నిర్వహించిన సభలో ఆయన ముఖ్య ప్రసంగం చేశారు. రాష్ట్రంలో రాబోయే కాలమంతా వైఎస్సార్ స్వర్ణయుగమే నడుస్తుందని ఆయన దృఢంగా విశ్వాసం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌కు లక్షలాది అభిమానులు ఉన్నారని, ఆయన ఆశయాలే తన రాజకీయ జీవితానికి అసలైన పునాది అని స్పష్టం చేశారు. తాను రాజకీయాల్లోకి రావడానికి వైఎస్సార్ అందించిన స్ఫూర్తి ఎంతో గొప్పదని చెప్పారు. రాజకీయ జీవితం కొనసాగినంత కాలం ఆయన సిద్ధాంతాలు, ఆశయాల సాధన కోసమే చిత్తశుద్ధితో పని చేస్తానని ప్రకటించారు. తాను ఎల్లప్పుడూ వైఎస్సార్ నిజమైన శిష్యుడిగానే కొనసాగుతానని గర్వంగా వెల్లడించారు. సమయం ఆసన్నమైనప్పుడు తాను తెలంగాణ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టిస్తానని ప్రకటించి రాజకీయ వర్గాల్లో పెద్ద ప్రకంపనలు సృష్టించారు. పదవులు తనకు అలంకారం కాదని, ప్రజలకు సేవ చేసే గొప్ప బాధ్యతగా మాత్రమే భావిస్తానని ఆయన తెలిపారు. సామాన్య పౌరుడి భావనతో నిజాయితీగా పని చేయడమే తన జీవిత పరమావధి అని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం లక్ష్యంగా గతంలో ఇతర పార్టీల నేతలను సాదరంగా ఆహ్వానించినట్లు రాజగోపాల్ రెడ్డి గుర్తు చేశారు. పార్టీలోకి కొత్తగా వచ్చి పాత నాయకులను బయటకు పంపుతామంటే మౌనంగా సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. తాను కాంగ్రెస్‌లో కొనసాగుతున్నంత కాలం ఈ పార్టీని ఎవరూ కూడా తమ సొంత జాగీరులా ఆక్రమించుకోలేరని తేల్చి చెప్పారు. మునుగోడుతో పాటు రాష్ట్రంలోని అసలైన కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరూ కూడా ఎలాంటి భయభ్రాంతులకు గురికావద్దని ఆయన ధైర్యం చెప్పారు. నిరుపేద వర్గాల అభ్యున్నతి, నాణ్యమైన విద్య, సమగ్ర వైద్య సౌకర్యాల సాధన కోసం నిరంతరం పోరాడతానని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రజలకు ఎలాంటి అన్యాయం జరగకూడదన్నదే తన ప్రాథమిక సిద్ధాంతమని స్పష్టం చేశారు. పార్టీని నమ్ముకున్న మూల నాయకులకు సరైన గుర్తింపు దక్కకుండా తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వ యంత్రాంగంలో కీలక పదవులను ఎవరు అనుభవిస్తున్నారో ప్రజలందరికీ స్పష్టంగా తెలుసని ఎద్దేవా చేశారు. నిజాయితీ గల పార్టీ సైనికులను రక్షించుకోవాల్సిన బాధ్యత నాయకత్వంపై ఎంతైనా ఉందని ఆయన గట్టిగా గుర్తు చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పన్నెండు వందల మంది వీరులు ప్రాణ త్యాగాలు చేశారని ఆయన ఎంతో భావోద్వేగంతో గుర్తు చేశారు. ఆ అమరుల బలిదానాలను గుర్తించి కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ రాష్ట్రాన్ని ప్రసాదించారని చెప్పారు. అటువంటి పవిత్రమైన గడ్డపై ఉద్యమకారులకు, కాంగ్రెస్ కార్యకర్తలకు తీరని ద్రోహం జరగడం తీవ్ర బాధాకరమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీమాంధ్రుల కనుసన్నల్లో, వారి అడుగుజాడల్లో నడవాల్సిన దుస్థితి ఎప్పటికీ రాకూడదని కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని, అంతర్గత విషయాలను రాహుల్ గాంధీతో పాటు పార్టీ పరిశీలకుల వద్ద స్పష్టంగా వివరించినట్లు తెలిపారు. కొన్ని నియోజకవర్గాల్లో పాత కార్యకర్తలు పడుతున్న కష్టాలు తనను కలచివేస్తున్నాయని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇతర పార్టీల నుంచి అకస్మాత్తుగా వచ్చిన వారికి టిక్కెట్లు కేటాయిస్తే నమ్ముకున్న కార్యకర్తల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాణాలను పణంగా పెట్టిన వారికి కాకుండా కొత్తవారికి పెద్దపీట వేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని ధ్వజమెత్తారు. వ్యక్తిగతంగా తనకు ఎవరిపైనా ద్వేషం లేదని, పార్టీ భవిష్యత్తు కోసమే ఈ నిజాన్ని నిర్భయంగా వెల్లడిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. తాను గతంలో తెలంగాణ ఉద్యమంలో ప్రత్యక్షంగా పోరాడానని, కేంద్ర పార్లమెంట్‌లో గళమెత్తి తెలంగాణ ప్రత్యేక ఆకాంక్షను చాటిచెప్పిన చరిత్ర తనకు ఉందని గుర్తు చేశారు. ఉద్యమ నేపథ్యం ఉన్న తనలాంటి నాయకులకే న్యాయం జరగకపోతే సామాన్య కార్యకర్తల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కావాలని కొందరు వ్యక్తులు తనపై పనిగట్టుకుని వెటకారపు రాతలు రాయిస్తూ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. పార్టీని నమ్ముకున్న వాటాదారులందరూ ఏకమై ఉద్యమ నాయకులను, నమ్మకస్తులైన కార్యకర్తలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. తమ పార్టీ అత్యున్నత నాయకుడు ఎప్పటికీ రాహుల్ గాంధీ మాత్రమేనని స్పష్టం చేశారు. అధిష్టానం తీసుకునే ఏ నిర్ణయానికైనా తాను కట్టుబడి ఉంటానని చెప్పారు. పార్టీ మధ్యలో చేరిన వ్యక్తులు తమను అవమానించాలని చూస్తే మాత్రం చూస్తూ ఊరుకోబోనని గట్టి హెచ్చరికలు జారీ చేశారు. తెలంగాణ సమాజం ఆత్మగౌరవంతో బతకాలన్నదే అమరుల కల అని ఆయన నియోజకవర్గ వేదికపై పునరుద్ఘాటించారు. కార్యకర్తల సమస్యలను పరిష్కరించే దిశగా తన వంతు ప్రయత్నాలు నిరంతరం కొనసాగుతూనే ఉంటాయని ప్రజలకు భరోసా కల్పించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికపై పోరాటాలు సాగిస్తూనే అధికార యంత్రాంగం వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడతానని చెప్పారు. ఉద్యమకారుల ఆశయాలకు అనుగుణంగా పాలన సాగాలని, స్వార్థ శక్తుల చేతుల్లోకి వ్యవస్థ వెళ్లకుండా కాపాడుకోవాలని ప్రజలను కోరారు. పార్టీ కోసం చెమటోడ్చిన నాయకులకు తగిన ప్రాధాన్యత దక్కేంత వరకు తన గళం మూగబోదని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ శ్రేణులంతా ఐక్యంగా నిలిచి అంతర్గత శత్రువులను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య తెలంగాణ నిర్మాణంలో ప్రతి కార్యకర్త కీలక భాగస్వామి కావాలని కాంక్షించారు. వైఎస్సార్ బాటలో పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తానని పునరుద్ఘాటించారు. ప్రజాసేవలో ఎటువంటి రాజీ పడకుండా ముందుకెళ్తానని రాజగోపాల్ రెడ్డి తన ప్రసంగాన్ని ముగించారు.




# మూసీ ప్రాజెక్టుకు హైకోర్టు బ్రేక్!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు హైకోర్టులో కీలక పరిణామం ఎదురైంది. ప్రాజెక్టు కోసం భూసేకరణ చేపడుతున్న ప్రభుత్వ తీరును సవాల్ చేస్తూ హిమాయత్‌సాగర్ పరిధిలోని పలువురు భూనిర్వాసితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తమ భూములను అధికారులు నిబంధనలకు విరుద్ధంగా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని పిటిషనర్లు ఆరోపించారు. ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర డీపీఆర్ లేకుండానే భూములు తీసుకోవడం ఎలా సాధ్యమని వారు ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన హైకోర్టు ప్రభుత్వ చర్యలపై కీలక సందేహాలు వ్యక్తం చేసింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు పిటిషనర్ల ఆస్తులను స్వాధీనం చేసుకోవద్దని అధికారులను ఆదేశించింది. దీంతో భూసేకరణ ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఈ పరిణామం మూసీ ప్రాజెక్టు అమలుపై రాజకీయ, న్యాయ వర్గాల్లో చర్చకు దారితీసింది. బాధిత రైతుల్లో మాత్రం ప్రస్తుతానికి ఊరట కనిపిస్తోంది. హిమాయత్‌సాగర్ ప్రాంతంలో మూసీ అభివృద్ధి పనుల కోసం అధికారులు భూసేకరణ ప్రక్రియను ప్రారంభించారు. అయితే తమ భూములను తీసుకునే ముందు ప్రాజెక్టు పూర్తి వివరాలు వెల్లడించలేదని బాధితులు పేర్కొన్నారు. ప్రాజెక్టు ఎక్కడి నుంచి ఎక్కడి వరకు ఉంటుంది, భూసేకరణ ఎంత మేరకు జరుగుతుంది, ప్రభావిత కుటుంబాలకు ఎలాంటి పరిహారం అందుతుంది వంటి అంశాలపై స్పష్టత లేదని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టుకు వివరించారు. ప్రధానంగా డీపీఆర్ లేకుండా భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నం జరుగుతోందని వారు వాదించారు. న్యాయవాదులు కె.వివేక్ రెడ్డి, కె.ప్రతీక్ రెడ్డి బాధితుల తరఫున తమ వాదనలు వినిపించారు. పక్కా ప్రణాళిక లేకుండా అధికారులు ముందుకు వెళ్తున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రైతుల ఆస్తి హక్కులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ వాదనలను పరిశీలించిన న్యాయస్థానం ప్రభుత్వ చర్యలపై వివరణ కోరింది. పిటిషనర్ల వాదనలు విన్న హైకోర్టు కీలక మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు పిటిషనర్ల భూముల్లో అధికారులు జోక్యం చేసుకోకూడదని స్పష్టం చేసింది. వారి ఆస్తులను స్వాధీనం చేసుకోవద్దని ఆదేశిస్తూ స్టే విధించింది. దీంతో హిమాయత్‌సాగర్ పరిధిలో భూసేకరణకు తాత్కాలికంగా అడ్డుకట్ట పడింది. ఇదే సమయంలో ఈ వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. భూసేకరణకు చట్టపరమైన ఆధారాలు, ప్రాజెక్టు ప్రణాళిక, డీపీఆర్ వంటి అంశాలపై ప్రభుత్వం తన వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. తదుపరి విచారణలో ఈ అంశాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అప్పటివరకు బాధితుల ఆస్తులపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని కోర్టు ఆదేశాలు అమల్లో ఉంటాయి. దీంతో ప్రభుత్వ అధికారులు తదుపరి న్యాయపరమైన పరిణామాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చే లక్ష్యంతో నదీ పరివాహక ప్రాంత అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. అయితే ప్రాజెక్టు అమలులో భూసేకరణ ప్రధాన సవాలుగా మారుతోంది. భూములు కోల్పోయే కుటుంబాలు తమ హక్కులు, పరిహారం, పునరావాసంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. గతంలో కూడా మూసీ పరిధిలో భూసేకరణపై వివిధ వర్గాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. తాజాగా హైకోర్టు ఆదేశాలతో ఈ అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం తన వాదనలను న్యాయస్థానం ముందు సమర్పించాల్సి ఉంటుంది. డీపీఆర్‌కు సంబంధించిన వివరాలు కూడా కీలకంగా మారనున్నాయి. తదుపరి విచారణలో కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ప్రస్తుత హైకోర్టు ఆదేశాలు మూసీ ప్రాజెక్టును పూర్తిగా రద్దు చేసినట్లు భావించాల్సిన అవసరం లేదు. ఇది పిటిషనర్ల భూములపై తదుపరి ఉత్తర్వుల వరకు స్వాధీనం చర్యలను నిలిపివేసిన మధ్యంతర ఆదేశంగా చూడాలి. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసిన తరువాత న్యాయస్థానం ప్రాజెక్టు ప్రణాళిక, భూసేకరణ విధానం, బాధితుల హక్కులు వంటి అంశాలను పరిశీలించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మూసీ ప్రాజెక్టు అమలుకు న్యాయపరమైన అంశాలు అత్యంత కీలకంగా మారాయి. బాధిత రైతులకు చట్టపరమైన రక్షణ కల్పించడంతో పాటు, ప్రాజెక్టు ప్రయోజనాలు కొనసాగించే మార్గాన్ని ప్రభుత్వం అన్వేషించాల్సి ఉంటుంది. హిమాయత్‌సాగర్ భూవివాదం తదుపరి విచారణల్లో ఎలాంటి మలుపు తిరుగుతుందో చూడాలి. అప్పటివరకు భూములపై చర్యలు నిలిచిపోనున్నాయి.

# 50 ఎకరాల అసైన్డ్ భూమి మాయం!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని హవాడిగూడ గ్రామ పరిసరాల్లో తీవ్ర సంచలనం సృష్టించిన భూ వ్యవహారం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ చర్చకు దారితీసింది. సర్వే నంబర్ 49లో ఉన్న సుమారు 50 ఎకరాల అసైన్డ్ భూమిని కొందరు పలుకుబడి కలిగిన వ్యక్తులు దౌర్జన్యంగా లాక్కున్నారనే వార్తలు స్థానిక ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. తరతరాలుగా ఈ ప్రాంతంలోనే జీవిస్తూ వ్యవసాయ పనులు చేసుకుంటున్న పేద దళిత గిరిజన రైతుల హక్కులను కాలరాస్తూ అధికారులు రికార్డులను సమూలంగా మార్చేశారు. దశాబ్దాలుగా ప్రభుత్వ రికార్డుల్లో నిస్సందేహంగా నమోదైన అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా అడ్డగోలుగా అనుమతులు మంజూరు చేశారు. చట్టబద్ధమైన పత్రాలు నిబంధనలు గాలికొదిలేసి అధికార పార్టీ అండదండలతో సాగించిన ఈ భారీ అక్రమం గ్రామీణ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తతకు ఆందోళనకు కారణమైంది. నిరుపేదలైన అన్నదాతల భూములను అన్యాయంగా కాజేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతు సంఘాలు ముక్తకంఠంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. న్యాయం కోసం నిరసనలు చేపడుతూ పేద ప్రజలు తమ గళాన్ని గట్టిగా వినిపిస్తున్నారు. బాధితుల పక్షాన రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తే గత 50 ఏళ్లుగా ఈ నిర్దిష్ట విస్తీర్ణం బంచరాయి ప్రభుత్వ ఆస్తిగానే స్పష్టంగా నమోదై ఉందని తేటతెల్లమవుతోంది. క్షేత్రస్థాయి పరిశీలన జరపకుండా అసైన్డ్ హక్కుల చట్టాన్ని తుంగలో తొక్కి ఉన్నతాధికారులు క్లియరెన్స్ ఇవ్వడం పట్ల ప్రజల్లో అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయి. కలెక్టర్ స్థాయి అధికారితో పాటు స్థానిక రెవెన్యూ సిబ్బంది చేతులు కలిపి విచారణ లేకుండానే రాత్రికి రాత్రే నిషేధిత జాబితా నుంచి తొలగించారు. సాధారణంగా ఎంతో కఠినమైన ప్రక్రియగా ఉండే పట్టా మార్పిడి వ్యవహారాన్ని రికార్డు సమయంలో పూర్తి చేయడం వెనుక బలమైన రహస్య ఒప్పందాలు ఉన్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. కాగితాలపై అక్రమంగా వివరాలు మార్చి ప్రైవేటు వ్యక్తుల పేర్లను చేర్చడం పాలనా వ్యవస్థ వైఫల్యాన్ని తెలియజేస్తోంది. నిబంధనలను బేఖాతరు చేస్తూ వ్యవహరించిన తీరు అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోందని బాధితులు చెబుతున్నారు. వ్యవస్థలో చోటుచేసుకున్న ఈ అక్రమ మార్పులను పరిశీలించి చట్టపరమైన చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉంది. ఈ తప్పిదాలను వెంటనే సరిదిద్దాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ భూ బదిలీ వెనుక అధికార కాంగ్రెస్ పార్టీ ప్రముఖుల హస్తం ఉందన్న అంశం తీవ్ర దుమారం రేపుతోంది. రికార్డులు మార్చిన 50 ఎకరాల్లో సగం విస్తీర్ణాన్ని గాంధీ భవన్ పీఆర్వో కుటుంబ సభ్యుల పేరిట నమోదు చేయడం గమనార్హం. మిగిలిన 25 ఎకరాలను ఇతర ప్రభావవంతమైన వ్యక్తుల ఖాతాల్లోకి చేర్చి రిజిస్ట్రేషన్ పనులను చకచకా ముగించారు. బడుగు బలహీన వర్గాల కోసం కేటాయించిన అసైన్డ్ భూములు ఒకే కుటుంబానికి చెందేలా మార్చడం వెనుక పెద్ద రాజకీయ శక్తుల ప్రమేయం స్పష్టంగా కనిపిస్తోంది. పారదర్శక పాలన అందిస్తామని చెప్పే నాయకులు ఇలాంటి భూ ఆక్రమణలకు పాల్పడటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. పేదల భూములను బడా బాబులకు కట్టబెట్టే కుట్రలో అధికార యంత్రాంగం భాగస్వామ్యం కావడంపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. ఈ వ్యవహారంలో తెరవెనుక ఉన్న కీలక సూత్రధారులను వెంటనే బహిర్గతం చేయాలని ప్రజలు కోరుతున్నారు. రాజకీయ పలుకుబడితో భూములు లాక్కోవడం ప్రజాస్వామ్య వ్యవస్థకే తీరని కళంకం తెస్తోందని నాయకులు హెచ్చరిస్తున్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోవాల్సిన అవసరం గత 20 సంవత్సరాలుగా తమ చెమటోడ్చి భూమిని సారవంతం చేసుకుని పంటలు పండించుకుంటున్న పేద రైతుల బతుకులు ఇప్పుడు రోడ్డున పడ్డాయి. ఎకరానికి కేవలం 20 వేల రూపాయలు విసిరేసి వారిని బలవంతంగా భూముల నుంచి గెంటేయడం అత్యంత అమానవీయమైన చర్యగా మారింది. నిరక్షరాస్యులైన రైతులను బెదిరించి తెల్ల కాగితాలపై సంతకాలు చేయించుకున్నారన్న ఆరోపణలు విచారకరం. తమకు జరిగిన తీరని అన్యాయంపై కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ బాధితులకు ఎలాంటి న్యాయం జరగలేదు. అధికారుల చుట్టూ తిరిగినా కనీస సమాధానం చెప్పకపోవడంతో పేద రైతులు నిస్సహాయ స్థితిలో కన్నీరుమున్నీరవుతున్నారు. కష్టపడి సాగు చేసుకున్న భూమిని దూరం చేయడంతో కుటుంబాల పోషణ ప్రశ్నార్థకంగా మారింది. నిస్సహాయులైన కర్షకుల గోడు పట్టించుకోని అధికార వర్గాల తీరు సమాజంలో తీవ్ర ఆవేదనను వ్యతిరేకతను కలిగిస్తోంది. అన్నదాతలను నిరాశ్రయులుగా మార్చిన ఈ దారుణంపై రాష్ట్రవ్యాప్తంగా నిరసన జ్వాలలు మిన్నంటుతున్నాయి తగిన పరిహారం ఇవ్వాలి. బాధితుల కన్నీళ్లను తుడిచేందుకు మానవతా దృక్పథంతో ఉన్నతాధికారులు సత్వరమే స్పందించి బాసటగా నిలవాల్సిన గురుతర బాధ్యత ఈ భారీ కుంభకోణం సమగ్ర సమాచారం తెలుసుకునేందుకు సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకున్నా రెవెన్యూ వర్గాలు వివరాలు దాటవేస్తున్నాయి. బాధితులకు సమాచారం ఇవ్వకుండా కార్యాలయాల చుట్టూ తిప్పుతూ కాలయాపన చేయడం అనుమానాలను మరింత బలపరుస్తోంది. సర్వే నంబర్ 49లో జరిగిన అన్ని అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి అసలైన హక్కుదారులకు న్యాయం చేయాలని ఎస్సీ ఎస్టీ సంఘాలు ఉద్యమిస్తున్నాయి. స్వతంత్ర దర్యాప్తు సంస్థతో ఉన్నత స్థాయి విచారణ జరిపించి బాధ్యులైన అధికారులతో పాటు ఆక్రమణదారులపై కఠిన చట్టపరమైన కేసులు నమోదు చేయాలి. పేదల భూమిని అక్రమంగా కాజేసిన వారిని జైలుకు పంపేంతవరకు శాంతియుత పోరాటాన్ని ఆపేది లేదని స్థానిక నాయకులు హెచ్చరిస్తున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి పేద రైతులకు వారి పూర్వపు హక్కులను పునరుద్ధరించాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు. తప్పు చేసిన ప్రతి ఒక్కరికీ కఠినమైన శిక్ష పడేలా చూసి సామాన్యులకు భరోసా కల్పించాలి. ప్రజా సంక్షేమాన్ని కాపాడాల్సిన ప్రజాప్రతినిధులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని పేద వర్గాలకు రక్షణ కల్పించాలి.

# అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ఉతికి ఆరేస్తాం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**




తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజా పాలన పేరుతో ప్రజలను వంచిస్తూ ప్రజా పీడన సాగిస్తున్నారని మండిపడ్డారు. వెయ్యి రోజుల పాలనను ఒక క్రిమినల్ వేస్ట్‌గా ఆయన అభివర్ణించారు. రాష్ట్రంలో అనుముల బ్రదర్స్ అనకొండల్లా మారి ఎక్కడా భూములను వదలకుండా ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ కాంట్రాక్టుల కేటాయింపుల్లో సీఎం సోదరులు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుయాయులు 30 శాతం వరకు భారీ కమీషన్లు వసూలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మెగా కృష్ణారెడ్డితో పాటు మంత్రుల అనుచరులకే కీలక పనులన్నీ దక్కుతున్నాయని చెప్పారు. గురువు చంద్రబాబుకు లబ్ధి చేకూర్చేలా గోదావరి, కృష్ణా జలాలను గురుదక్షిణగా సమర్పిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాబు తొత్తును ఇరిగేషన్ సలహాదారుగా నియమించుకున్నారని పేర్కొన్నారు. ఉగ్రవాదుల మాదిరిగా మూడు చెక్‌డ్యాంలను పేల్చివేశారని ఆరోపించారు. పెద్దవాగు, సుంకేశుల ప్రాజెక్టులు దెబ్బతింటే ఎన్‌డీఎస్‌ఏ తనిఖీలకు రాలేదని గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ విశ్రాంత ఇంజనీర్లను బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులను జైల్లో పెడతామని, బెల్టు ట్రీట్‌మెంట్ ఇస్తామని ఈ ప్రభుత్వం చిల్లర హెచ్చరికలు జారీ చేస్తోందని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. గడిచిన వెయ్యి రోజుల పాలనా కాలంలో కాంగ్రెస్ సర్కారు ఏకంగా రూ.4.50 లక్షల కోట్ల మేర భారీగా అప్పులు చేసిందని కేటీఆర్ లెక్కలతో సహా వివరించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన రూ.50 వేల కోట్ల రైతు రుణమాఫీ హామీని కేవలం రూ.20 వేల కోట్లకు కుదించి రైతాంగాన్ని దగా చేశారని ఆక్షేపించారు. వరి ధాన్యానికి ఇస్తామన్న బోనస్ పూర్తిగా బోగస్‌గా మారిందన్నారు. వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు అమర్చే దురుద్దేశంతోనే రైతు డిస్కంలను కాంగ్రెస్ పాలకులు తెరపైకి తెచ్చారని విమర్శించారు. ఢిల్లీ అధిష్టానానికి నిధుల మూటలు పంపుతూ రాహుల్ గాంధీ జేబులు నింపే జేబు దొంగలా రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి ఒక కీలుబొమ్మలా మారి పాలనను గాలికొదిలేశారని ఎద్దేవా చేశారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కారం కాకపోవడంతో వేలాది మంది సెక్రటేరియట్ ఎదుట నిరసనకు దిగారని పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు లేని నిరర్థక జాబ్ క్యాలెండర్ చూపించి కాంగ్రెస్ మోసం చేసిందని దుయ్యబట్టారు. గతంలో హామీ ఇచ్చిన 2 లక్షల ఉద్యోగాల ఊసే లేకుండా పోయిందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. లగచర్లలో అమాయక రైతుల చేతులకు సంకెళ్లు వేసి నిర్బంధించారని గుర్తుచేశారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో సరైన వసతులు, పర్యవేక్షణ లేక ఇప్పటివరకు 150 మంది నిరుపేద విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని కేటీఆర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఈ సర్కారు నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. హెచ్‌సీయూ పరిధిలో జరిగిన రూ.10 వేల కోట్ల భారీ కుంభకోణంపై కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఈడీ ఇప్పటివరకు ఎందుకు దర్యాప్తు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర జనాభాలో 51 శాతంగా ఉన్న బీసీ వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగిందని, వెయ్యి రోజుల్లో వారి కోసం కేవలం రూ.5 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని చెప్పారు. కాంట్రాక్టులలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న మాటను నిలబెట్టుకోలేదన్నారు. అభయహస్తం అనేది శతాబ్దపు అతిపెద్ద మోసపూరిత మేనిఫెస్టో అని విమర్శించారు. అర్హులైన కోటి 67 లక్షల మంది మహిళల బ్యాంకు ఖాతాల్లో రూ.1.50 లక్షల చొప్పున జమచేసి వారిని నిజమైన లక్షాధికారులను చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆ విధంగా నిధులు జమ చేస్తే తాము ప్రజాప్రతినిధుల పదవులకు తక్షణమే రాజీనామాలు చేస్తామని ఆయన బహిరంగ సవాల్ విసిరారు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు నిరుపేదలకు నెలకు రూ.4 వేల పింఛన్ అందిస్తుంటే, ఇక్కడి సీఎంకు ప్రజల బాధలు పట్టడం లేదని కేటీఆర్ మండిపడ్డారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని చెప్పి చివరకు ప్రైవేటీకరణ వైపు నెడుతున్నారని విమర్శించారు. సంస్థ కార్మికుడు శంకర్‌గౌడ్ ఆత్మహత్యకు ప్రభుత్వ వైఫల్యమే కారణమన్నారు. పెన్షన్లు సకాలంలో అందక విశ్రాంత ఉద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వాపోయారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారి క్రైమ్ రేట్ విపరీతంగా పెరిగిపోయిందని ధ్వజమెత్తారు. ఫోక్సో కేసు నిందితులను, నేరారోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ నేత కుమారుడిని కాపాడటానికి ప్రభుత్వ పెద్దలు ప్రయత్నించారని ఆరోపించారు. సీఎం నివాసం, పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ భూవివాదాల సెటిల్‌మెంట్లకు కేంద్రాలుగా మారాయని పేర్కొన్నారు. మహారాష్ట్ర పోలీసులు హైదరాబాద్‌కు వచ్చి మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకోవడం శాంతిభద్రతల వైఫల్యానికి నిదర్శనమన్నారు. సింగరేణి సంస్థ పరిధిలోని నల్లబంగారాన్ని ఉపముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు యథేచ్ఛగా దోచుకుంటున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి బావమరిది స్వయంగా టెండర్లలో జోక్యం చేసుకుంటున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు. లిక్కర్ సరఫరా నుంచి మేడారం జాతర గద్దెల వరకు ప్రతిచోటా టెండర్ల కుంభకోణాలు సాగుతున్నాయని కేటీఆర్ మండిపడ్డారు. పాలకులు పెడుతున్న ఒత్తిళ్లు తట్టుకోలేక సీనియర్ ఐఏఎస్ అధికారులు పదవులకు రాజీనామాలు చేస్తున్నారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి బ్రదర్స్ సాగిస్తున్న విచ్చలవిడి అవినీతిని మంత్రి కొండా సురేఖ కుమార్తె స్వయంగా బహిర్గతం చేశారని కేటీఆర్ ప్రస్తావించారు.

# హైదరాబాద్‌లో డిఫెన్స్ ఎక్స్‌పో

మొదటిపేజీ తరువాయి

ఒకే వేదికపైకి తేవడం ఈ సదస్సు ప్రధాన ఉద్దేశం. హైదరాబాద్ నగరానికి ఉన్న సాంకేతిక నైపుణ్యం, పరిశ్రమల అనుకూలతలను అంతర్జాతీయ వేదికపై బలంగా చాటిచెప్పే విధంగా ఈ భారీ కార్యాచరణను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసింది. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఇది కీలకంగా మారుతుంది. దేశవ్యాప్తంగా రక్షణ రంగంలో నిమగ్నమైన స్టార్టప్‌లు, యువ పరిశోధకులు, శాస్త్రవేత్తలు పెద్ద ఎత్తున పాల్గొనేలా రక్షణ ఎక్స్‌పో ప్రణాళికలు రూపుదిద్దుకున్నాయి. కేంద్ర మంత్రి స్వయంగా హాజరై దిశానిర్దేశం చేస్తే నవకల్పనల రంగంలో ఉన్న యువతకు మరింత ఉత్తేజం లభిస్తుందని సీఎం వివరించారు. ఈ ప్రదర్శన కోసం భారత వైమానిక దళానికి చెందిన ప్రత్యేక యుద్ధ విమానాలు, సూర్యకిరణ్, సారంగ్ వంటి సుప్రసిద్ధ ఏరోబాటిక్ విమాన బృందాలతో అత్యద్భుత ఎయిర్‌షో నిర్వహించాలని కోరారు. దీనికి సంబంధించి అవసరమైన గగనతల అనుమతులు త్వరగా జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. గగనతల విన్యాసాలతో పాటు ఆధునిక యుద్ధ విమానాలను ప్రజలు దగ్గరగా చూసేందుకు వీలుగా ప్రత్యేక స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనను ఏర్పాటు చేయాలని సూచించారు. త్రివిధ దళాల భాగస్వామ్యంతో ఈ ప్రదర్శనను అంతర్జాతీయ ప్రమాణాలకు ఏమాత్రం తగ్గకుండా అత్యంత వైభవంగా నిర్వహించాలని నిర్ణయించారు. రక్షణ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు తెలంగాణను ప్రధాన తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఈ విస్తృత ప్రదర్శన ఒక సువర్ణ అవకాశంగా నిలవనుంది. భారత త్రివిధ దళాలైన ఆర్మీ, నేవీ, వైమానిక దళాలకు చెందిన అత్యున్నత స్థాయి ప్రతినిధులు, విశ్రాంత ఉన్నతాధికారులు ఇందులో ప్రధాన భాగస్వామ్యం వహించాలని ప్రభుత్వం కోరింది. సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో నడిచే క్షిపణులు, రాడార్లు, డ్రోన్లు, ఆధునిక కమ్యూనికేషన్ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలను సదస్సులో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దేశీయ రక్షణ అవసరాలను తీరుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలైన హెచ్‌ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ లాంటి దిగ్గజ సంస్థలతో పాటు డీఆర్‌డీవో పరిధిలోని వివిధ పరిశోధనా ప్రయోగశాలలు కూడా ఎక్స్‌పోలో విస్తృతంగా స్టాళ్లను నెలకొల్పనున్నాయి. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా స్వదేశీ పరిజ్ఞానాన్ని అంతర్జాతీయ సమాజం ముందు సమగ్రంగా ప్రదర్శించాలని ప్రతిపాదించారు. వివిధ విదేశీ ప్రభుత్వాల రక్షణ ప్రతినిధులు, అంతర్జాతీయ సంస్థల ప్రముఖులతో ద్వైపాక్షిక వాణిజ్య సమావేశాలు సజావుగా సాగేలా కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ సమన్వయం అందించాలని కోరారు. ఇలాంటి సమష్టి ప్రయత్నాల ద్వారా రాష్ట్రంలో భారీ స్థాయి రక్షణ విడిభాగాల తయారీ యూనిట్లు ఏర్పడతాయని ప్రభుత్వం ఆశిస్తోంది. రాష్ట్రంలో విమానయాన రంగాన్ని విస్తరించడంలో భాగంగా ప్రతిపాదిత ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించిన కీలక భూసేకరణ అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలో 750 ఎకరాల భూసేకరణను విజయవంతంగా పూర్తి చేసింది. రక్షణ శాఖ మొత్తం విమానాశ్రయ నిర్మాణానికి 1500 ఎకరాలు అవసరమని కోరడంతో, మిగిలిన మరో 750 ఎకరాల స్థలాన్ని వెంటనే సేకరించి అప్పగించేందుకు పూర్తి అంగీకారం తెలిపినట్లు వివరించారు. ఎయిర్‌పోర్టు అభివృద్ధి పనులను వేగవంతం చేస్తే ఉత్తర తెలంగాణ ప్రాంతంలో రవాణా సదుపాయాలు పెరిగి ఆర్థిక కార్యకలాపాలు విస్తరిస్తాయని వివరించారు. భారత వైమానిక దళ స్థావరంతో పాటు పౌర విమానయాన సేవలకు ఈ విమానాశ్రయం అనువుగా రూపుదిద్దుకోనుంది. పారిశ్రామిక రవాణా, యువతకు కొత్త ఉపాధి అవకాశాలు ఈ విమానాశ్రయం ద్వారా లభిస్తాయి. ఆదిలాబాద్ ప్రాంతంలో విమాన కనెక్టివిటీ ఏర్పడితే దేశీయ పర్యాటక రంగానికి కూడా నూతన శోభ చేకూరుతుందని ప్రభుత్వం దృఢంగా విశ్వసిస్తోంది. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో రక్షణ పరిశోధన, అభివృద్ధి ప్రయోగశాల ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు అవసరమైన పూర్తి సహాయ సహకారాలను అందించేందుకు తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ముందుకొచ్చింది. ఈ పరిశోధనా ప్రాజెక్టుకు సంబంధించి మొత్తం 416.18 ఎకరాల భూమిని కేటాయించేందుకు సంస్థ అధికారికంగా పూర్తి అనుమతిని మంజూరు చేసింది. ఈ భూమిని ఎకరానికి కాకుండా మొత్తం విస్తీర్ణానికి కలిపి సంవత్సరానికి కేవలం రూ.1 నామమాత్రపు లీజు అద్దెతో కేటాయించారు. ప్రాథమికంగా 33 సంవత్సరాల కాలపరిమితికి ఈ ఒప్పందం వర్తిస్తుంది. పరిశోధనల నిరంతర కొనసాగింపు దృష్ట్యా అవసరమైతే ఈ లీజు గడువును మరో రెండుసార్లు ఇదే పద్ధతిలో పొడిగించుకునే పూర్తి అవకాశం కల్పించారు. కేంద్ర రక్షణ పరిశోధనలకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. భవిష్యత్ రక్షణ పరికరాల తయారీ, నూతన ఆవిష్కరణల నిలయంగా తెలంగాణను నిలపడంలో ఈ భారీ పరిశోధనా ప్రాజెక్టు కీలక భూమిక పోషిస్తుంది.



## శ్రేయస్ టీమిండియా పర్మనెంట్ కెప్టెన్

మొదటిపేజీ తరువాయి




చాలా మంది మాజీలు విమర్శించారు. అయితే భారత జట్టు పగ్గాలను చేపట్టిన ఆరంభంలోనే అయ్యర్‌కు చేదు అనుభవం ఎదురైంది. అతడి సారథ్యంలోని టీమిండియా వరుసగా ఐర్లాండ్, ఇంగ్లండ్ సిరీస్‌లలో ఓటమి పాలైంది. ఆ తర్వాత అయ్యర్ కెప్టెన్‌గా అద్భుతమైన కమ్‌బ్యాక్ ఇచ్చాడు. గత నెలలో జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌ను భారత్ 30 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది. టీమిండియా టీ20 కెప్టెన్‌గా తొలి సిరీస్ విజయాన్ని అందుకుంది. ఇప్పుడు అతడు కెప్టెన్సీలోనే భారత జట్టు స్వదేశంలో అఫ్ఘానిస్తాన్‌తో టీ20 సిరీస్ తలపడనుంది. సెప్టెంబర్ 13 నుంచి ఈ సిరీస్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో అయ్యర్ ఆసీస్ దిగ్గజం, పంజాబ్ కింగ్స్ హెడ్‌కోచ్ రికీ పాంటింగ్ ప్రశంసల వర్షం కురిపించాడు. శ్రేయస్‌కు అద్భుతమైన కెప్టెన్సీ స్కిల్స్ ఉన్నాయని, రిటైర్మెంట్ వరకు అతడే టీమిండియా కెప్టెన్‌గా ఉంటాడని పాంటింగ్ జోస్యం చెప్పాడు. "శ్రేయస్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఐపీఎల్ 2025 వేలంలో శ్రేయస్ కోసం భారీగా ఖర్చు చేసినప్పుడే, అతడిపై నాకు ఎంత నమ్మకం ఉందో అర్థం చేసుకోవచ్చు. అతడితో మళ్లీ కలిసి పనిచేయాలని అనుకున్నాను. ఒక ప్లేయర్‌గా అతడి నుంచి అత్యుత్తమ ప్రదర్శనను రాబట్టగలననే నమ్మకం నాకుంది. ఒక కెప్టెన్‌గా, టీమ్ లీడర్‌గా అయ్యర్‌తో పని చేయడాన్ని నేను ఎంతగానో ఆస్వాదిస్తాను. భారత టీ20 జట్టు కెప్టెన్సీ అప్పగించి బీసీసీఐ మంచి నిర్ణయం తీసుకుంది. తను టీ20 క్రికెట్ నుంచి రిటైర్ అయ్యే వరకు ఆ పదవికి అతడే సరైనోడు" అని ఇండియా టూడే ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు.

# 1000 రోజులు.. ఒక్క కేసు తేల్చలేదు!

మొదటిపేజీ తరువాయి



వేల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలలో లొసుగులు, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణాలు, ఔటర్ రింగ్ రోడ్డు లీజు అంశాలపై ప్రత్యేక కమిషన్లను నియమించింది. ధరణి పోర్టల్ ద్వారా జరిగిన భూ దందాలు, ఫార్ములా ఈ రేసు నిధుల మళ్లింపు, వివాదాస్పద ఫోన్ ట్యాపింగ్ బాగోతం, గొర్రెల పంపిణీ స్కామ్, టూరిజం విభాగం అక్రమాలు, సీఎంఆర్‌ఎఫ్ నిధుల గోల్‌మాల్‌పై వేర్వేరుగా కేసులు నమోదు చేశారు. పోలీస్ శాఖ, విజిలెన్స్ విభాగాలు నివేదికలు సిద్ధం చేసినా, 1000 రోజుల పాలనా కాలం ముగిసేసరికి ఒక్క కేసులో కూడా తుది తీర్పు లేదా నేరస్థుల నిర్ధారణ జరగలేదు. విచారణ కమిషన్ల కార్యాలయాల నిర్వహణకే లక్షల రూపాయల ప్రజాధనం ఖర్చవుతున్నా, అసలు నిందితులపై బలమైన చట్టపరమైన చర్యలు కానరాలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ వైఫల్యాలపై నియమించిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక న్యాయపరమైన చిక్కుల్లో పడింది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్, రాష్ట్ర విజిలెన్స్ నివేదికలు నిధుల దుర్వినియోగాన్ని ఎత్తిచూపినా ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించలేదు. కేసీఆర్, హరీశ్ రావుల అరెస్టుల వరకు వెళ్లకుండానే, చివరకు కాళేశ్వరంపై సీబీఐ విచారణ కోరుతూ కేంద్రానికి లేఖ రాసి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకుంది. ఫార్ములా ఈ కార్ రేసు వ్యవహారంలో కేటీఆర్‌పై విచారణకు రాజ్‌భవన్ అనుమతి ఇవ్వడం లేదంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. గవర్నర్ అధికారికంగా అనుమతి మంజూరు చేసిన తర్వాత కేటీఆర్ విచారణ లేదా అరెస్టుపై ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి పురోగతి లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ పరిణామాలు విపక్ష నేతలకు కొత్త రాజకీయ అస్త్రాలను అందించాయి. కాంగ్రెస్ సర్కార్ బాధ్యతలు స్వీకరించిన తొలినాళ్లలోనే తీవ్ర కలకలం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ గత 1000 రోజులుగా సాగుతూనే ఉంది. కీలక అధికారులు అరెస్టయినప్పటికీ, అసలు ఆదేశాలు ఇచ్చిన రాజకీయ పెద్దలపై చర్యలు శూన్యం. అసెంబ్లీ వేదికగా మైనింగ్ దోపిడీ, పారిశ్రామిక భూ కేటాయింపులు, ధరణి భూ వివాదాలపై హడావుడిగా విచారణ కమిటీలు ప్రకటించినా, ఆ తర్వాత వాటి ఊసే లేకుండా పోయింది. గత ప్రభుత్వాల అవినీతిని వెలికితీసి బాధ్యులను శిక్షించడం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వ బాధ్యత. అధికార పక్షం డైవర్షన్ పాలిటిక్స్ కోసమే తమపై తప్పుడు కేసులు మోపుతోందని ప్రతిపక్ష బీఆర్‌ఎస్ తీవ్రంగా ఆరోపిస్తోంది. కమిషన్లు వేసి కాలయాపన చేయడం చూస్తుంటే బీఆర్‌ఎస్ చేస్తున్న ఆరోపణలకు ప్రభుత్వం బలం చేకూర్చినట్లవుతోంది. ఈ వైఖరితో ప్రభుత్వ విశ్వసనీయత ప్రజల్లో రోజురోజుకూ క్రమంగా తగ్గుముఖం పడుతోంది. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీల అగ్రనేతల మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందాలతోనే ఈ కేసులు అటకెక్కాయన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఐదేళ్ల పాలనా కాలంలో ఇప్పటికే 1000 రోజులు పూర్తి చేసుకుంది, ఇక మిగిలింది కేవలం 820 రోజుల సమయం మాత్రమే.

## త్వరలో మూడు లక్షల కొత్త పెన్షన్లు




విశాలభారతి, స్టేట్ బ్యూరో:

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు తీరుస్తూనే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. పేదవాడి ఆత్మగౌరవమే లక్ష్యంగా ప్రస్తుత ఇందిరమ్మ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. బుధవారం సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్, వాకిటి శ్రీహరి, అట్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపీ వేం నరేందర్‌రెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. సుమారు 3,475 రోజుల పాలనలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని ఆరోపించారు. కాంట్రాక్టర్లు, సర్పంచులకు రావలసిన పెండింగ్ బిల్లులను తమ ప్రజా ప్రభుత్వం చెల్లిస్తోందని వివరించారు. అధికారంలో ఉన్నప్పుడు పనులు చేయించి బిల్లులు ఎగ్గొట్టిన చరిత్ర ఎవరిదో ప్రజలకు తెలుసని గుర్తుచేశారు. సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకువెళ్తున్నామని తెలిపారు. అర్హులైన నిరుపేదలకు త్వరలోనే కొత్తగా 3 లక్షల సంఖ్యకు పైగా సామాజిక పింఛన్లు మంజూరు చేయబోతున్నామని స్పష్టమైన ప్రకటన చేశారు. ప్రజా సంక్షేమమే ప్రథమ కర్తవ్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. గత పాలకులు సృష్టించిన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూనే ఈ కార్యక్రమాలను విజయవంతంగా చేపడతామని చెప్పారు. రైతాంగ క్షేమం కోసం కేవలం 1,000 రోజుల వ్యవధిలోనే రూ.1.76 లక్షల కోట్ల భారీ నిధులు వెచ్చించినట్లు మంత్రి వెల్లడించారు. రైతు భరోసా పథకం, సమగ్ర రుణమాఫీ, ఉచిత విద్యుత్ సరఫరా, విత్తనాలు, ఎరువుల రాయితీలు వంటి అనేక ప్రయోజనాలు కల్పించామని వివరించారు. సన్న రకం వడ్లకు కనీస మద్దతు ధరతో పాటు క్వింటాలుకు అదనంగా రూ.500 చొప్పున బోనస్ సొమ్ము చెల్లిస్తున్నామని ప్రకటించారు. గత పాలన నిరుద్యోగ యువతను తీవ్ర నిరాశకు గురిచేసిందని మండిపడ్డారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేశామన్నారు. నియామక పరీక్షలను పూర్తి పారదర్శకతతో నిర్వహిస్తూ వేలాది ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశామని స్పష్టం చేశారు. పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం నియోజకవర్గాల్లో సమీకృత గురుకుల పాఠశాలలు నిర్మిస్తున్నామన్నారు. డైట్ చార్జీలు, కాస్మెటిక్ భత్యాలు భారీగా పెంచడంతో పాటు ఉదయం నాణ్యమైన పౌష్టికాహార అల్పాహారం విద్యార్థులకు నిరంతరం అందిస్తున్నామని ధ్రువీకరించారు. ఉద్యోగ నియామకాల ప్రక్రియను రాష్ట్రవ్యాప్తంగా నిరంతరం కొనసాగిస్తూ అర్హులకు న్యాయం చేస్తామని మంత్రి సభలో వివరించారు. పేదలకు గూడు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని పొంగులేటి పేర్కొన్నారు. మొదటి విడతలో భాగంగా సుమారు 4.5 లక్షల ఇందిరమ్మ గృహాలను మంజూరు చేశామని తెలిపారు. వీటిలో ఇప్పటికే 2 లక్షల ఇళ్ల నిర్మాణం విజయవంతంగా పూర్తయిందని చెప్పారు. ప్రభుత్వం ఒక్కో గృహ నిర్మాణానికి రూ.5 లక్షల భారీ ఆర్థిక సహాయాన్ని అందజేస్తోందన్నారు. ఈ మొత్తాన్ని నాలుగు ప్రత్యేక విడతల్లో లబ్ధిదారులకు క్రమం తప్పకుండా విడుదల చేస్తున్నామని వెల్లడించారు. ఇప్పటికే చివరి విడత నిధుల పంపిణీ ప్రక్రియ సైతం ప్రారంభమైనట్లు స్పష్టం చేశారు. పార్టీలు, కులాలు, మతాలు చూడకుండా కేవలం నిరుపేదల అర్హత ప్రాతిపదికన మాత్రమే ఇళ్లను కేటాయిస్తున్నామని తెలియజేశారు. రానున్న రెండో దశలో మరో 2.5 లక్షల నూతన గృహాల మంజూరుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయని చెప్పారు. గృహ నిర్మాణ రంగంలో పారదర్శక విధానాలను అమలు చేస్తూ పేదల సొంతింటి కలను సంపూర్ణంగా సాకారం చేస్తున్నామని మంత్రి తెలియజేశారు. ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన జీవనం అందించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని ఆయన సభలో పునరుద్ఘాటించారు. హైదరాబాద్ నగరంలోని పేదలు జీవనోపాధి కోల్పోకుండా నివసించే నియోజకవర్గాల్లోనే ఇళ్లు కల్పిస్తామన్నారు. పైలట్ ప్రాజెక్టు కింద 20 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రత్యేకంగా ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇందులో 16 నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపుతో పాటు టెండర్ల పనులు ముగిశాయని, మిగిలిన 4 చోట్ల ప్రక్రియ సాగుతోందని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గానికి 480 ఇళ్లు, అదనపు కోటాతో కలిపి మొత్తం 600 ఇళ్ల చొప్పున బహుళ అంతస్తుల్లో ఆధునిక లిఫ్ట్ సౌకర్యాలతో నిర్మిస్తామన్నారు. సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో మహిళల పేరిట రిజిస్ట్రేషన్ జరుగుతుందని తెలిపారు. లక్కీ డ్రా పద్ధతి ద్వారా అర్హులను ఎంపిక చేస్తామని, ఎలాంటి పైరవీలు, దళారుల జోక్యానికి ఆస్కారం ఉండదని తేల్చి చెప్పారు. క్షేత్రస్థాయి పరిశీలన తర్వాతే అర్హత నిర్ధారిస్తామన్నారు. ఈ బృహత్తర నిర్మాణాలు నిరంతరం కొనసాగుతాయని మంత్రి పేర్కొన్నారు. డబ్బులు సమర్పించినా ఎవరి సిఫారసులు పనిచేయవని, రానున్న కాలంలో ఈ ప్రాజెక్టును ఇతర ప్రాంతాలకు మరింతగా విస్తరిస్తామని మంత్రి పొంగులేటి ప్రజల సమక్షంలో స్పష్టమైన మాటలతో గట్టిగా హెచ్చరిస్తూ తెలియజేశారు. గత పాలకులు భద్రాచలం ప్రాంతానికి, ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని మంత్రి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజాక్షేత్రంలో జరిగే ఎన్నికల తీర్పే తమ ప్రభుత్వానికి అసలైన ప్రజాభిప్రాయ సేకరణ అని స్పష్టం చేశారు. ఉప ఎన్నికలు, స్థానిక సంస్థల సమరంలో ప్రజలు కాంగ్రెస్ వైపే నిలిచారని గుర్తుచేశారు. రాజకీయ విమర్శలు హుందాగా ఉండాలని, అసభ్యకర పదజాలం తెలంగాణ సాంస్కృతిక వైభవానికి తగదని హెచ్చరించారు. 3,475 రోజుల నియంతృత్వ దొరల పాలనకు, ప్రస్తుత 1,000 రోజుల ప్రజాస్వామ్య ఇందిరమ్మ పరిపాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, విద్యార్థులకు నాణ్యమైన చదువు, రైతులకు అన్నివిధాలా పూర్తి ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. పేదలకు గృహవసతి కల్పించడం కేవలం ఖర్చు కాదని, అది వారి ఆత్మగౌరవానికి చేసే నిజమైన పెట్టుబడి అని మంత్రి పొంగులేటి ఉద్ఘాటించారు.

# తుమ్మిడిహెట్టిపై తేలని పంచాయితీ!

- తుమ్మిడిహెట్టి బ్యారేజీపై తెలంగాణ–మహారాష్ట్ర మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు
- తెలంగాణ 152 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మాణాన్ని ప్రతిపాదించింది
- 148 మీటర్లకు మించి ఎత్తు వద్దని మహారాష్ట్ర స్పష్టం చేసింది
- 152 మీటర్లతోనూ మహారాష్ట్రలో ముంపు తక్కువేనని తెలంగాణ వాదించింది
- బ్యారేజీ డిజైన్, టెక్నికల్ అంశాలపై అధ్యయనం తర్వాత నిర్ణయం తీసుకుంటామన్న మహారాష్ట్ర
- మరోసారి సమావేశం కావాలని ఇరు రాష్ట్రాల అధికారులు నిర్ణయించారు



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

గోదావరి నదిపై ప్రతిపాదిత తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై నెలకొన్న ప్రతిష్టంభన ప్రస్తుతానికి ఎటూ తేలలేదు. కేంద్ర జల సంఘం చైర్మన్ అనుపమ ప్రసాద్ అధ్యక్షతన ఢిల్లీ వేదికగా నిర్వహించిన కీలక సమావేశం ఎలాంటి స్పష్టమైన పరిష్కారం లభించకుండానే ముగిసింది. తెలంగాణ మహారాష్ట్ర రాష్ట్రాల ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతులకు సాగునీరు తాగునీరు అందించేందుకు ఈ ప్రాజెక్టు అత్యంత కీలకమని తెలంగాణ చెబుతోంది. తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు 152 మీటర్ల ఎత్తుతో రూపొందించిన కొత్త డిజైన్లను కమిషన్ ఎదుట ప్రదర్శించారు. ప్రాజెక్టు నిర్మాణానికి మహారాష్ట్ర మొదటినుంచీ తీవ్ర అభ్యంతరం తెలుపుతోంది. సరిహద్దు సమస్యలు నీటి లభ్యత గణాంకాలను అధికారులు సమగ్రంగా ప్రస్తావించారు. విభజన చట్టం హామీల అమలు ప్రాధాన్యతను కమిషన్ దృష్టికి తెచ్చారు. బ్యారేజీ నిర్మాణం ద్వారా ఉత్తర తెలంగాణ ప్రాంత సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుందని స్పష్టం చేశారు. ప్రాజెక్టు ఆవశ్యకతను తెలియజేసే పత్రాలను టేబుల్ ముందు ఉంచారు. ఇరుపక్షాల మధ్య వాదోపవాదాలు సుదీర్ఘంగా సాగాయి. కేంద్రం మధ్యవర్తిత్వం వహించినప్పటికీ తొలివిడతలో ఏకాభిప్రాయం కుదరలేదు. బ్యారేజీ ఎత్తు నిర్ధారణ అంశమే ఇరు రాష్ట్రాల మధ్య ప్రధాన వివాదంగా మారింది. తెలంగాణ ప్రభుత్వం 152 మీటర్ల ఎత్తుతో నిర్మాణం జరిపితేనే ఆయకట్టుకు సంపూర్ణ ప్రయోజనం దక్కుతుందని బలంగా వాదిస్తోంది. మహారాష్ట్ర అధికారులు 148 మీటర్ల పరిమితి దాటి ఒక్క అంగుళం కూడా పెంచే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఎత్తును పెంచడం ద్వారా తమ రాష్ట్ర భూభాగాలు తీవ్ర ముంపునకు గురవుతాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో చేసుకున్న ప్రాథమిక ఒప్పందాలను అధికారులు గుర్తుచేశారు. తెలంగాణ ప్రతినిధులు శాస్త్రీయ సర్వే వివరాలను బయటపెడుతూ ముంపు ప్రభావం చాలా స్వల్పమని వివరించారు. సరిహద్దు గ్రామాలకు ఎలాంటి ముప్పు కలగకుండా రక్షణ చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. సాంకేతిక నివేదికలను సమగ్రంగా పరిశీలించిన తర్వాత మాత్రమే నిర్ణయం వెలువరిస్తామని మహారాష్ట్ర ప్రతినిధులు స్పష్టం చేశారు. నీటి నిల్వ సామర్థ్యం కేటాయింపులపై లెక్కలు ఇంకా అసంపూర్ణంగా ఉన్నాయని వారు ఆరోపించారు. కేంద్ర జల సంఘం ప్రతినిధులు రెండు వైపులా వ్యక్తం అయిన అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. సాంకేతిక సరిహద్దుల నిర్ణయంపై తదుపరి స్థాయి విచారణ అవసరమని గుర్తించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూన్ 11వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ప్రత్యేకంగా లేఖ రాశారు. వెనుకబడిన ఆదిలాబాద్ ప్రాంత సమగ్ర అభివృద్ధికి తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు జీవనాడి అని అందులో వివరించారు. 152 మీటర్ల ఎత్తుతో నిర్మించే విషయంలో మహారాష్ట్ర వ్యక్తపరుస్తున్న అభ్యంతరాలను లేఖలో ప్రస్తావించారు. రెండు రాష్ట్రాల మధ్య ఏర్పడిన ప్రతిష్టంభనను తొలగించడానికి కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. ఇరు రాష్ట్రాల అధికారులతో ఉమ్మడి వేదిక ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. ముఖ్యమంత్రి వినతిపై ప్రధానమంత్రి కార్యాలయం వేగంగా స్పందించింది. తక్షణమే చర్యలు చేపట్టాలని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు సూచనలు పంపింది. కేంద్ర మంత్రిత్వ శాఖ ఈ బాధ్యతను జల సంఘానికి అప్పగించింది. ఈ నేపథ్యం ఆధారంగానే దేశ రాజధానిలో ఉన్నత స్థాయి చర్చలు జరిగాయి. రాజకీయ ఒత్తిళ్లు పెరగడంతో పాలనా వర్గాలు అప్రమత్తమయ్యాయి. ప్రాజెక్టు అమలులో జాప్యం జరగకుండా చూడాలని తెలంగాణ అధికార వర్గాలు కోరాయి. కేంద్రం జోక్యం చేసుకోవడం ద్వారా సమస్య త్వరలోనే ఒక కొలిక్కి వస్తుందని తెలంగాణ నాయకత్వం ఆశిస్తోంది. ప్రాజెక్టు పూర్తి డిజైన్లు సాంకేతిక లెక్కలపై అధ్యయనం చేయడానికి మహారాష్ట్ర ఇంజనీరింగ్ బృందం మరింత గడువు కావాలని కోరింది. 152 మీటర్ల ఎత్తు వల్ల గడ్చిరోలి జిల్లాలోని అటవీ ప్రాంతాలు వ్యవసాయ క్షేత్రాలు మునిగిపోతాయని వారు విశ్లేషించారు. ముంపు నివారణకు సంబంధించిన ఖర్చులను తెలంగాణ పూర్తిగా భరించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. తెలంగాణ అధికారులు ఉపగ్రహ ఆధారిత చిత్రాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించారు. తక్కువ విస్తీర్ణంలోనే ప్రభావం ఉంటుందని నిరూపించడానికి ప్రయత్నించారు. అటవీ శాఖ అనుమతులు పర్యావరణ అనుమతుల అంశాన్ని మహారాష్ట్ర అధికారులు ప్రధానంగా లేవనెత్తారు. రెండు రాష్ట్రాల ప్రయోజనాలకు విఘాతం కలగకుండా సాంకేతిక సర్దుబాట్లు చేయాలని సూచించారు. వివాదం మరింత సంక్లిష్టంగా మారడంతో కమిషన్ సభ్యులు మౌనం వహించారు. నదీ పరివాహక ప్రాంతాల భద్రతను కేంద్ర బృందం పరిశీలించనుంది. నీటి లభ్యత వాటాల లెక్క తేల్చడానికి సంయుక్త పరిశీలన తప్పనిసరిగా మారింది. రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పరిష్కారం వెతకాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తొలి రౌండ్ చర్చల్లో ఎలాంటి తుది నిర్ణయం వెలువడకపోవడంతో సమావేశం అర్ధాంతరంగా ముగిసింది. మహారాష్ట్ర ఉన్నతాధికారులు తమ ప్రభుత్వంతో సంప్రదించి సమగ్ర నివేదికను రూపొందించిన తర్వాతనే మరోసారి సమావేశం కావాలని తీర్మానించారు. సంయుక్త సాంకేతిక కమిటీ ఏర్పాటు చేసే ప్రతిపాదనను కేంద్ర జల సంఘం ముందుకు తెచ్చింది. ప్రాజెక్టు ఎత్తు నిల్వ సామర్థ్యాలపై నిపుణుల సలహాలు స్వీకరించాలని నిర్ణయించారు. తదుపరి సమావేశంలో క్షేత్రస్థాయి వివరాలు చర్చకు రానున్నాయి. ఉమ్మడి జిల్లా ప్రజల దాహార్తి తీర్చేందుకు తెలంగాణ సర్కార్ ప్రయత్నాలను ముమ్మరం చేసింది. గోదావరి బేసిన్ ప్రాజెక్టుల విభజన అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. కేంద్రం సమన్వయకర్తగా వ్యవహరించి సయోధ్యకు దిద్దేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తోంది. రాజకీయ విమర్శలు పక్కనపెట్టి నిపుణుల కమిటీ పర్యవేక్షణలో సరిహద్దు సర్వే నిర్వహించే అవకాశం కనిపిస్తోంది. ప్రాజెక్టు నిర్మాణ వేగం పుంజుకోవాలంటే ఇరు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం అనివార్యంగా మారింది. రాబోయే రోజుల్లో ఢిల్లీలో మరో విడత చర్చలు కొనసాగనున్నాయి.

# డిఫెన్స్ నుంచి అటాక్‌లోకి సురేఖ

మొదటిపేజీ తరువాయి

సమర్థనలకే పరిమితం కాకుండా క్రమశిక్షణ నిర్ణయాలకు ఉన్న మౌలిక కొలమానాలను ప్రశ్నిస్తూ రాజకీయ చర్చను సీఎం రేవంత్ రెడ్డి వైఖరి చుట్టూ మళ్లించారు. దేశ రాజధాని వేదికగా సాగిన మీడియా చిట్‌చాట్ ద్వారా ఆమె విసిరిన ప్రశ్నలు గాంధీ భవన్ గదుల నుండి ఢిల్లీలోని ఏఐసీసీ పెద్దల వరకు పెద్ద ప్రకంపనలు సృష్టించాయి. తనపై చర్యలు తీసుకోవడానికి ముందు పార్టీ రాజ్యాంగం ఎవరికెలా వర్తిస్తుందో తేల్చాలంటూ ఆమె సాగించిన వ్యూహాత్మక ప్రసంగం కాంగ్రెస్ శ్రేణులను ఇప్పుడు విస్మయానికి గురిచేస్తోంది. ఈ మొత్తం పరిణామం సురేఖ రాజకీయ తెగింపును ప్రతిబింబిస్తూ సొంత పార్టీకి సరికొత్త సవాలును విసిరింది. ఢిల్లీ చిట్‌చాట్‌లో సురేఖ సంధించిన ప్రధాన అస్త్రం క్రమశిక్షణ ప్రమాణాల సమానత్వమే. పార్టీలో అందరికంటే ముందు సీఎం రేవంత్ రెడ్డిపైనే చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేయడం తీవ్ర కలకలం రేపింది. తాను మరో పదేళ్లపాటు సీఎంగా కొనసాగుతానంటూ రేవంత్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ఆ ప్రకటన అధిష్ఠాన విధానాలకు విరుద్ధం కాదా అని గట్టిగా నిలదీశారు. తన వ్యాఖ్యలపై కత్తి ఝుళిపించాలని చూస్తున్న నాయకత్వం సీఎం మాటలను ఎందుకు చూసీచూడనట్లు వదిలేస్తోందని ప్రశ్నించారు. అధిష్ఠానానికి ఎవరైనా సమానమే అన్న సూత్రాన్ని గుర్తుచేస్తూ చర్యలకు సంబంధించిన పూర్తి బాధ్యతను పార్టీ పెద్దలపైకి నెట్టేశారు. తనపై ఎలాంటి నిర్ణయం తీసుకున్నా దానిని పక్షపాత చర్యగా ముద్ర వేయడానికి ఈ వాదనను సమర్థవంతంగా అడ్డుపెట్టుకున్నారు. కేవలం తన వ్యక్తిగత అంశాలకే పరిమితం కాకుండా నేరుగా ముఖ్యమంత్రినే లక్ష్యంగా చేసుకోవడం ద్వారా పార్టీ నాయకత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా చేయాలన్నది ఆమె ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది. రేవంత్ రెడ్డిని టార్గెట్ చేయడం ద్వారా సురేఖ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతున్న అంతర్గత చర్చల స్వరూపాన్నే సమూలంగా మార్చేశారు. ఈ వివాదంలోకి సురేఖ బీసీ కార్డును అలాగే సామాజిక న్యాయం అంశాన్ని అత్యంత వ్యూహాత్మకంగా తీసుకువచ్చారు. వెనుకబడిన వర్గాలకు చెందిన నాయకురాలిగా ఉన్న తనపై తొందరపడి వేటు వేయాలని చూస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్న స్పష్టమైన సంకేతాన్ని పంపారు. బలహీన వర్గాల వారికి ఒక న్యాయం, అగ్రవర్ణాలకు మరో న్యాయం కాంగ్రెస్‌లో ఉంటుందా అంటూ నేరుగా సామాజిక సమీకరణాలను లేవనెత్తారు. ఇది కేవలం క్రమశిక్షణ సమస్య మాత్రమే కాదని, దీని వెనుక సామాజిక వివక్ష కోణం దాగి ఉందన్న భావనను విస్తృతంగా ప్రచారం చేయాలని చూశారు. తెలంగాణలో బీసీ ఓటు బ్యాంకును కాపాడుకోవాలని నిరంతరం తాపత్రయపడుతున్న కాంగ్రెస్ అధిష్ఠానానికి ఈ అంశం నిజంగా మింగుడుపడనిదే. ఒక బలహీన వర్గ మహిళా మంత్రినే తొలగించారన్న అపవాదు మూటగట్టుకుంటే అది రాబోయే రోజుల్లో పార్టీకి తీరని రాజకీయ నష్టాన్ని కలిగిస్తుందని హెచ్చరించారు. ఈ బలమైన కార్డును ఉపయోగించడం ద్వారా తనపై ఎలాంటి చర్య తీసుకోకుండా పార్టీ పెద్దల చేతులను కట్టేయాలని సురేఖ చాలా తెలివిగా ప్రయత్నించారు.



# కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ తిరుగుబాటు



**విశాల భారతి ఇబ్రహీంపట్నం**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం సాగర్ హైవేపై భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో అనేకం అమలుకు నోచుకోలేదని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. భారీ ప్లెక్సీలతో నిర్వహించిన నిరసన ర్యాలీలో కాంగ్రెస్ ప్రభుత్వ హామీలను ప్రశ్నిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. 420 హామీలు ఆరు గ్యారంటీలు అంటూ ప్రజలను నమ్మించి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, రైతులకు భరోసా, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, ప్రతి కుటుంబానికి అనేక సంక్షేమ హామీలు ఇస్తామని చెప్పింది. మహిళలకు తులం బంగారం, స్కూటీ వంటి హామీలను కూడా ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసింది. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల పరిస్థితి ఏమిటో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టడం సరికాదని అన్నారు. హామీల అమలుపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసి ప్రజలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, హామీల అమలు కోసం ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని మంచిరెడ్డి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ కృపేష్, ఒంగేటి లక్ష్మారెడ్డి, కర్నాటి రమేష్ గౌడ్, దండెం రామిరెడ్డి, మడుపు వేణు గోపాల్ రావు, నిట్టు జగదీష్, ఇబ్రహీంపట్నం బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు వార్డు మెంబర్లు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ జన్మదినం, మానవత్వం చాటిన జనసైనికులు

- **ప్రజాసేవ,సమాజం పట్ల నిబద్ధతకు ఆయనే మాకు స్ఫూర్తి**
- **ఉమ్మడి నల్లగొండ జిల్లా జనసేన పార్టీ ఇంచార్జ్ మేకల సతీష్ రెడ్డి**



**చౌటుప్పల్,విశాల భారతి:** ప్రజా సేవకే అంకితమైన జనసేన అధినేత,ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను చౌటుప్పల్ జనసైనికులు ఘనంగా,సేవా స్ఫూర్తితో జరుపుకున్నారు. జనసేన నాయకులు ఆముదాల పరమేశ్ ఆధ్వర్యంలో జయశ్రీ గార్డెన్స్ లో జరిగిన ఈ వేడుకకు ఉమ్మడి నల్లగొండ జిల్లా జనసేన పార్టీ ఇంచార్జ్ మేకల సతీష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బడుగు శ్రీరాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా మేకల సతీష్ రెడ్డి మాట్లాడుతూ.. "పవన్ కళ్యాణ్ చూపిస్తున్న ప్రజాసేవ, సమాజం పట్ల నిబద్ధత మాకు స్ఫూర్తి. ఆయన పుట్టినరోజును కేవలం కేక్ కట్ చేసి హంగామా చేయకుండా, ప్రజలకు నేరుగా ఉపయోగపడే సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం నిజమైన జనసేన సిద్ధాంతం" అని అన్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో పవన్ కళ్యాణ్ జన్మదిన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. వేడుకలో భాగంగా వృద్ధులకు అండగా నిలిచేలా 80 మంది వృద్ధులకు చేతి కర్రలు మరియు స్టాండ్లను ఉచితంగా పంపిణీ చేశారు. సహాయం అందుకున్న వృద్ధులు జనసేన నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీక ప్రవీణ్ కుమార్, పల్చం శ్రీకాంత్, బొల్లం మల్లేశ్, పెద్దగొని లింగస్వామి, ప్రశాంత్, బద్రి రాజు, కునూరు శ్రీకాంత్, సంజయ్, కృష్ణ రెడ్డి, సుల్తాన్ రాజు, రమణబాబు, శివరామ్, నిఖిల్, తేజ తదితర జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ సేవలు చిరస్మరణీయం: ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి

- **ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైఎస్ఆర్ వర్ధంతి**
- **ఘన నివాళులర్పించిన నేతలు**



**నిజామాబాద్ జిల్లా విశాల భారతి:** దివంగత మహా నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆ మహానేత వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనమైన నివాళులర్పించారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీలో తిరుగులేని నాయకుడిగా ఎదిగిన మహోన్నతమైన వ్యక్తి దివంగత నేత వైఎస్ఆర్ అని కొనియాడారు. ఆయన సేవలు మరువలేనివని గుర్తు చేసుకుంటూ... ఎంతోమంది నాయకులకు ఆయన స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, రాష్ట్ర గీతా పారిశ్రామిక కార్పొరేషన్ చైర్మన్ శేఖర్ గౌడ్, ఐసీడీఎంఎస్ మాజీ చైర్మన్ సాయరెడ్డి, బాగా రెడ్డి, భాస్కర్ రెడ్డి, అమృతాపూర్ గంగాధర్, ఉమ్మాజి నరేష్, పొలసాని శ్రీనివాస్, సాయిరెడ్డి, బాలరాజు, జలందర్ రెడ్డి, వాసు, జనార్దన్, మోహన్, అంబర్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

## చెరువులకు పూర్తిస్థాయిలో నీరు విడుదల చేయాలి



**కోదాడ, (విశాలభారతి):** నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలో చెరువులు, కుంటలను నింపేందుకు నీటిని విడుదల చేసినప్పటికీ, కోదాడ మండల పరిధిలోని కొత్తగూడెం మేజర్ చివరి ఆయకట్టు రైతులకు నీరందక తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బోల్లు ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కోదాడ నీటిపారుదల శాఖ (ఇరిగేషన్ డివిజన్) కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)కి రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బోల్లు ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం నీటిని విడుదల చేసినా కోదాడ మండలంలోని కొత్తగూడెం మేజర్ పరిధిలో ఉన్న తమ్మర, బండపాలెంతో పాటు పలు గ్రామాలకు నీరు సరిపడా రావడం లేదన్నారు. దీనివల్ల నేటి వరకు కూడా ఆయా గ్రామాల పరిధిలోని చెరువులు నిండని పరిస్థితి నెలకొందని తెలిపారు. సాగునీరు అందక రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కాలువల ద్వారా పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేసి, చెరువులను నింపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు సజ్జ సుబ్బారావు, సామినేని రమేష్, సామినేని సతీష్, బొల్లు నరేష్, బత్తినేని రమేష్, మందులపు రమేష్, కనగాల పూర్ణచంద్రరావు, కమతం సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన విఫలం: బాజిరెడ్డి జగన్

**420 హామీలతో ప్రజలను మోసం చేశారంటూ బీఆర్ఎస్ నిరసన**

**నిజామాబాద్ జిల్లా విశాల భారతి**

అధికారంలోకి రావడానికి అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, వాటిని అమలు చేయకుండా ప్రజలను నిరాశకు గురిచేస్తోందని మాజీ ఎమ్మెల్యే షకీల్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్ నాయకులను ప్రజలు నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన విఫలమైందని ఆరోపిస్తూ బుధవారం డిచ్‌పల్లి తెలంగాణ తల్లి చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో సుమారు 420 హామీలు ఇచ్చి ప్రజల ఓట్లను పొందిన కాంగ్రెస్, ప్రస్తుతం ఆ హామీల అమలులో విఫలమైందని జిల్లా ఇంచార్జ్ ధర్పల్లి మాజీ జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్ ఆరోపించారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి జగన్ మాట్లాడుతూ, అధికారం కోసం కాంగ్రెస్ నాయకులు అడ్డగోలుగా హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. తప్పుడు వాగ్దానాలు చేసి ప్రజల నమ్మకాన్ని పొందిన కాంగ్రెస్ నాయకులను ప్రజలు ప్రశ్నించాలని కోరారు. సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రజలను మరోసారి మోసం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జగన్ సూచించారు. పార్టీ పిలుపు మేరకు వారం రోజులపాటు నిర్వహించే అన్ని కార్యక్రమాలను నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిందని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రుల పాలనపై కూడా విమర్శలు గుప్పించారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్పల్లి, మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇందల్వాయి మండల అధ్యక్షుడు చిలివేరి దాసు, ఉపాధ్యక్షుడు పులి శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ బిరీష్ శెట్టి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాశం కుమార్, సీనియర్ నాయకులు మారంపల్లి సుధాకర్, పిండి గంగాధర్, పులి సాగర్, సున్నపల్లి ఎంపీటీసీ కచ్చకాయల శ్రీనివాస్, గాండ్ల శ్రీనివాస్, మల్లాపూర్ సర్పంచ్ దర్శనం మోహన్. ఇతర మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నిరసన తెలిపారు.

## మణికొండ–నెక్నాంపూర్ ప్రజా సమస్యలపై కార్తిక్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన




**రాజేంద్రనగర్, విశాల భారతి :**

మణికొండ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజుల పాలన పూర్తవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ నిరసన కార్యక్రమాలు చేపట్టింది. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు పిలుపు మేరకు బుధవారం సాయంత్రం మర్రిచెట్టు వద్ద మణికొండ, నెక్నాంపూర్ మున్సిపల్ డివిజన్ల పరిధిలో పరిష్కారం కాని ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ నాయకులు ఛార్జ్‌షీట్ విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానికంగా ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని పలు సమస్యలను బీఆర్ఎస్ నాయకులు ఛార్జ్‌షీట్‌లో పొందుపరిచారు. పుప్పలగూడలోని అంబేద్కర్ భవనం, శ్మశానవాటికకు రహదారి నిర్మాణం, బుల్కాపూర్ నాలా సమస్య, నూతనంగా నిర్మించిన మున్సిపల్ భవనం వినియోగంలోకి తీసుకురావడం వంటి అంశాలను ప్రధానంగా ప్రస్తావించారు. అలాగే క్రికెట్ గ్రౌండ్ నిర్మాణానికి అవసరమైన నిధులను విడుదల చేయాలని, ఆస్తిపన్ను విషయంలో పాత పద్ధతిని కొనసాగించాలని, భూగర్భజలాలు కలుషితం కాకుండా మురుగునీటి పారుదల పైప్‌లైన్ పనులకు అయిన ఖర్చు వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రధాన రహదారుల విస్తరణ, రహదారులకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను పక్కకు తరలించడం వంటి సమస్యలను కూడా ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. నెమలి నగర్ ప్రాంత ప్రజలకు ఇంటి నంబర్లు కేటాయించాలని, చిత్రపురి కాలనీకి సంబంధించిన ఖాళీ స్థలాల దస్తావేజుల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. అలకాపూర్ టౌన్‌షిప్ పరిధిలో ప్రజా ప్రయోజన కార్యక్రమాలను చేపట్టి, స్థానికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు, ఆయా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. స్థానిక సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## నడిరోడ్డుపై రౌడీషీటర్ దారుణ హత్య



- **వేటాడి మరీ నరికి చంపిన దుండగులు.. మైలారదేవుపల్లిలో తీవ్ర కలకలం**

**రాజేంద్రనగర్, విశాల భారతి:** మైలారదేవుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో దారుణ హత్య చోటుచేసుకుంది. నడిరోడ్డుపై ఓ రౌడీషీటర్‌ను గుర్తుతెలియని దుండగులు వెంబడించి కిరాతకంగా హత్య చేశారు. ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర భయాందోళన నెలకొంది. ఘటనపై సమాచారం అందుకున్న మైలారదేవుపల్లి పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. క్లూస్ టీమ్ ఘటనా స్థలంలో ఆధారాలను సేకరించింది. హత్యకు పాత కక్షలు, గతంలో ఉన్న వివాదాలు కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితులను గుర్తించేందుకు పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. హత్యకు ముందు బాధితుడిని నిందితులు వెంబడించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనకు గల అసలు కారణాలు, నిందితుల వివరాలు దర్యాప్తు పూర్తయిన తర్వాత వెల్లడికానున్నాయి.

## నూతన అంగన్వాడీ బిల్డింగ్‌కు శంకుస్థాపన

**కీసర సంతోష్ రెడ్డి.. పద్మావతి రెడ్డి సహకారంతో 12,00,000/- నిధులు మంజూరు**





**మోతె సెప్టెంబర్ 02 విశాల భారతి :** బుధవారం మండల పరిధిలోని సిరికొండ గ్రామంలో యం యల్ ఏ ఉత్తమ్ పద్మావతి రెడ్డి 12,00,000 / పన్నెండు లక్షల రూపాయలతో మంజూరు చేసిన నూతన అంగన్వాడీ బిల్డింగ్ కు నియోజకవర్గ అభివృద్ధి నిధులతో శంకుస్థాపన చేసిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డిమాట్లాడుతూ కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా అనేక నిధులు ఇచ్చి నియోజక వర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ముదిరెడ్డి మధుసూదన్ రెడ్డి , జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కొప్పురాజు సతీష్‌బాబు గ్రామ సర్పంచ్ బొర్రా వెంకటేష్, ఉప సర్పంచ్ రావుల రాజీవ్ , వార్డు సభ్యులు , నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ క్రైమ్, డ్రగ్స్‌పై అవగాహన సమావేశం

**అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్‌కు స్పందించొద్దు: ఎస్సై సురేష్**



**పినపాక, విశాల భారతి:** సైబర్ నేరగాళ్ల మోసాలకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏడూళ్లబయ్యారం ఎస్సై సురేష్ సూచించారు. అనుమానాస్పద లింకులు, మెసేజ్‌లు, ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, ఏటీఎం పిన్ వంటి సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సీఐ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు బుధవారం ఏడూళ్లబయ్యారం పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ క్రైమ్, డ్రగ్స్, గంజాయి నివారణపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సురేష్ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు వివిధ రకాల మోసపూరిత కాల్స్, లింకులు, నకిలీ మెసేజ్‌ల ద్వారా ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేయకుండా, అనుమానం కలిగితే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. అలాగే యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల ఆరోగ్యం, కుటుంబ జీవితం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామాల్లో గంజాయి, డ్రగ్స్ విక్రయాలు లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. నేరాల నియంత్రణకు ప్రజలు పోలీసులతో సమన్వయం చేసుకుని సహకరించాలని ఎస్సై సురేష్ కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజలు, యువత తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ ప్రజా భరోసాతో అవగాహన



**మోతె , సెప్టెంబర్ 02 విశాల భారతి :** సూర్యాపేట జిల్లా ఎస్పీ నర్సింహ ఆదేశాల మేరకు బుధవారం మండల పరిధిలోని నామావరం గ్రామంలో 'పోలీస్ ప్రజా భరోసా' కార్యక్రమంలో భాగంగా సబ్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలకు , విద్యార్థులకు సైబర్ నేరాలు , మహిళల భద్రత , మత్తు పదార్థాల నియంత్రణ మరియు రహదారి భద్రతపై సమగ్ర అవగాహన కల్పించారు.ఈ సదస్సులో ఎస్ఐ లచ్చి రెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల్లో చైతన్యం తేవడమే పోలీస్ ప్రజా భరోసా ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రజలు సైబర్ జాగరూకత ఆన్‌లైన్ లాటరీలు , నకిలీ లింకులు , పార్ట్ టైమ్ ఉద్యోగాల పేరుతో వచ్చే మోసపూరిత లింకులను నమ్మవద్దని , ఓటీపీ లు ఎవరికీ చెప్పవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 కి కాల్ చేయాలన్నారు. పోలీస్ అక్క మహిళలు , విద్యార్థినుల రక్షణ కోసం పోలీస్ శాఖ ప్రవేశపెట్టిన 'పోలీస్ అక్క' సేవలపై అవగాహన కల్పించారు. వేధింపులకు గురయ్యే మహిళలు ఎలాంటి భయం లేకుండా పోలీసులను సంప్రదించవచ్చని భరోసా ఇచ్చారు. మత్తు పదార్థాల నిర్మూలన యువత, విద్యార్థులు గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గ్రామంలో ఎవరైనా ఇలాంటి అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రహదారి భద్రత వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, మైనర్ డ్రైవింగ్ మరియు అతివేగం ప్రమాదకరమని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రాణాలు కాపాడుకోవాలని కోరారు. డైల్ 112 అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏకీకృత అత్యవసర నంబర్ 112 (పాత నంబర్ 100 స్థానంలో) ను ఎలా ఉపయోగించుకోవాలో ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, పోలీస్ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

**పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిది**



**పినపాక, విశాల భారతి:** ఏడూళ్ల బయ్యారం క్రాస్‌రోడ్డులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డా. వై.ఎస్. రాజశేఖరరెడ్డి వర్ధంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పేరం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్ర అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం కోసం చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని సీనియర్ నేతలు కొనియాడారు. వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మండల సీనియర్ నాయకులు, సర్పంచులు, ఉప సర్పంచులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పినపాక లో మండల స్థాయి క్రీడా పోటీలకు ఏర్పాట్లపై సమావేశం

**పినపాక ఎంఈఓ కొమరం నాగయ్య**

**పినపాక, విశాల భారతి :** పినపాక మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీల నిర్వహణపై ఏడూళ్ల బయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి కొమరం నాగయ్య ఆధ్వర్యంలో మండలంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈ నెల 17 నుంచి జానంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అండర్ 14, అండర్ 17 బాలబాలికల విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. విద్యార్థులు క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని అధికారులు ఆకాంక్షించారు. సమావేశంలో పినపాక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి. రామ్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు వీరన్న, రాములమ్మ, వరలక్ష్మి, విజయలక్ష్మి, లక్ష్మి, సత్యనారాయణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఎన్‌డీపీఎస్ కేసుల దర్యాప్తుపై పోలీసులకు ప్రత్యేక శిక్షణ

**ఫ్యూచర్ సిటీ పోలీసులకు టీజీపీఏలో రెండు రోజుల ప్రత్యేక శిక్షణ ముగింపు**





**రాజేంద్రనగర్, విశాల భారతి:** మాదకద్రవ్యాల సంబంధిత నేరాల దర్యాప్తు సామర్థ్యాలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ఆధ్వర్యంలో హిమాయత్‌సాగర్‌లోని ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ (టీజీపీఏ)లో నిర్వహించిన రెండు రోజుల ప్రత్యేక ఎన్‌డీపీఎస్ చట్టం శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. సెప్టెంబర్ 1, 2 తేదీల్లో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో కమిషనరేట్ పరిధి లోని ఏసీపీలు, ఎస్‌హెచ్‌ఓలు, ఎస్ఐలు, స్టేషన్ రైటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి, ఐపీఎస్ మాట్లాడుతూ.. ఎన్‌డీపీఎస్ కేసుల్లో చట్టబద్ధమైన, సాక్ష్యాధారాలతో కూడిన నాణ్యమైన దర్యాప్తుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. శిక్షణలో భాగంగా CCTNS, eSakshya వంటి సాంకేతిక వేదికల వినియోగం, సెర్చ్-సీజ్ విధానాలు, ఫిర్యాదులు, సీజ్ పంచనామాల తయారీ, స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలను ప్యాకింగ్, సీలింగ్, వెయింగ్ చేసే విధానాలపై అవగాహన కల్పించారు. అలాగే తప్పనిసరి దర్యాప్తు టెంప్లేట్లు, డాక్యుమెంటేషన్, బెయిల్‌ను వ్యతిరేకించే విధానాలు, సీన్ ఆఫ్ క్రైమ్ ఫోటోగ్రఫీ-వీడియోగ్రఫీ, డ్రగ్ ఐడెంటిఫికేషన్, డీడీ కిట్ వినియోగం, డ్రగ్స్ డిస్పోజల్ తదితర కీలక అంశాలపై అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఎన్‌డీపీఎస్ కేసుల్లో చట్టపరమైన, విధానపరమైన నిబంధనలను కచ్చితంగా పాటించాలని, స్వాధీనం చేసుకున్న ఆధారాలను సక్రమంగా భద్రపరచడంతో పాటు సమగ్ర డాక్యుమెంటేషన్ నిర్వహించాలని కమిషనర్ సూచించారు. దర్యాప్తులో చిన్నపాటి లోపాలకు కూడా అవకాశం లేకుండా చర్యలు చేపట్టి, కేసులు న్యాయస్థానాల్లో పటిష్టంగా నిలిచేలా ఆధారాలను సేకరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎయిర్‌ఫోర్స్ మాజీ డైరెక్టర్, మాజీ ఐపీఎస్ అధికారి ఎం. సందీప్ శాండిల్యను మాదకద్రవ్యాల నియంత్రణ, అమలులో ఆయన అందించిన విలువైన సేవలు, అనుభవం, నైపుణ్యానికి గుర్తింపుగా ఘనంగా సన్మానించారు. రెండు రోజుల శిక్షణతో ఎన్‌డీపీఎస్ కేసుల దర్యాప్తులో పోలీసు అధికారుల వృత్తిపరమైన నైపుణ్యాలు మరింత మెరుగుపడ్డాయని అధికారులు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం, చట్టపరమైన విధానాలు, మాదకద్రవ్యాల నియంత్రణలో అనుసరించాల్సిన ఉత్తమ పద్ధతులపై అవగాహన బలోపేతమైందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో చురుకైన భాగస్వామ్యం కనబరిచిన ఏసీపీలు, ఎస్‌హెచ్‌ఓలు, ఎస్ఐలు, స్టేషన్ రైటర్లను పోలీస్ కమిషనర్ అభినందించారు. అలాగే కోర్స్ కోఆర్డినేటర్లు, రిసోర్స్ పర్సన్స్, కార్యక్రమంలో భాగస్వాములైన పోలీసు అధికారుల సేవలను ప్రశంసించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, సరఫరాపై జీరో టాలరెన్స్ విధానాన్ని కొనసాగిస్తూ.. డ్రగ్స్ ముప్పును అరికట్టేందుకు ఫ్యూచర్ సిటీ పోలీసులు కఠినమైన, సమర్థవంతమైన చర్యలను నిరంతరం కొనసాగిస్తారని కమిషనర్ స్పష్టం చేశారు.

## సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో నిలిచిన వైఎస్సార్



**కోదాడ, (విశాలభారతి):** దివంగత మాజీ ముఖ్యమంత్రి, డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం కోదాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వంటిపులి వెంకటేష్ ఆధ్వర్యంలో నివాళి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న వైఎస్సార్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ, వెంకటరత్నం బాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ దేవరపల్లి మల్లేశ్వరి ముఖ్య అతిథులుగా హాజరై నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ, వంగవీటి రామారావు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్లు వంటి విప్లవాత్మక సంక్షేమ పథకాలతో వైఎస్సార్ పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల జీవితాల్లో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. ఆయన అందించిన పాలన ప్రజా సంక్షేమానికి మార్గదర్శకమని, వైఎస్సార్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వంటిపులి వెంకటేష్, నాయకులు చింతలపాటి శ్రీనివాసరావు, తోట జ్యోతి శ్రీనివాస్, అంబటికర్ర శ్రీనివాసరావు, ఈదుల కృష్ణయ్య, గంధం యాదగిరి, నంబూరి సూర్యం, దండా వీరభద్రం, గార్లపాటి వీరారెడ్డి, సుందరి వెంకటేశ్వర్లు, పత్తిపాక జనార్ధన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బషీర్ భాయ్, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కందుల కోటేశ్వరరావు, కౌన్సిలర్లు తూణం కృష్ణ, ఎస్కే షాబుద్దీన్, గంధం బాలేంద్ర పాండు, కట్టెబోయిన శ్రీనివాస్ యాదవ్, మూడెం సైదుబాబు, బాయ్ జాన్, ముస్తఫా, మాతంగి శైలజ సహా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## గంజాయి రహిత పట్టణంగా మార్చాలి

- **సీఐకి కాంగ్రెస్ విజ్ఞప్తి.. పట్టణాన్ని గంజాయి రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యం**
- **అక్రమ విక్రేతలపై ఉక్కుపాదం మోపుతాం.. కోదాడ పట్టణ సీఐ శివశంకర్**



**కోదాడ, విశాలభారతి:** కోదాడ పట్టణంలో గంజాయి విక్రయాలు, వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని కోరుతూ బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టణ సీఐ శివశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో గంజాయి మహమ్మారి వల్ల యువత భవిష్యత్తు నాశనమవుతోందని, అక్రమ విక్రయదారులపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి ఉక్కుపాదం మోపాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు. దీనిపై సీఐ శివశంకర్ స్పందిస్తూ.. కోదాడను పూర్తి గంజాయి రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. యువత భవిష్యత్తుతో ఆడుకునే గంజాయి రవాణాదారులను, విక్రేతలను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. గంజాయి నిర్మూలనకు ప్రజలు, నాయకులు పోలీసులకు సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ, వైస్ చైర్మన్ మల్లీశ్వరి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వంతుపులి వెంకటేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ షేక్ బషీర్, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మిల్లుపై సివిల్ సప్లై అధికారులు మెరుపు దాడులు



**నిజామాబాద్ జిల్లా విశాలభారతి:** నవీపేట మండలం అనంతగిరి శివారులో గల ఎస్ఆర్ఎం ట్రేడర్‌పై హైదరాబాద్ టాస్క్ ఫోర్స్, సివిల్ సప్లై అధికారులు, నవీపేట పోలీసులు మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ దాడిలో ఎస్ఆర్ఎం ట్రేడర్స్ లో 523 క్వింటాళ్ల అక్రమంగా నిలువ ఉంచిన PDS బియ్యాన్ని స్వాధీన పరుచుకున్నట్లు సివిల్ సప్లై డిప్యూటీ తాసిల్దార్ పవన్ కుమార్ బుధవారం తెలిపారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం, చించోలి గ్రామంలోని అన్నపూర్ణ ట్రేడర్స్ నుంచి అక్రమంగా అనంతగిరి లోని SRM ట్రేడర్స్ లోకి PDS బియ్యాని సరఫరా చేస్తున్నట్లు అధికారులు నిర్ధారించారు. ఈ దాడిలో 523 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీన పరుచుకుని, ఒక డీసీఎం వాహనాన్ని సీజ్ చేశారు. SRM ట్రేడర్స్ యజమాని శివప్రసాద్, అన్నపూర్ణ మిల్లు యజమాని హరికృష్ణ లపై కేసు నమోదు నమోదు చేసినట్లు తెలిపారు. SRM ట్రేడర్స్ లో PDS అక్రమ బియ్యం రవాణా పై ఇప్పటివరకు మూడు కేసులు నమోదు అయినట్లు పేర్కొన్నారు. మరో మారు ఇలాంటి చర్యలకు పాల్పడితే పిడియాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.. ఈ దాడిలో టాస్క్ DSP శేఖర్ రెడ్డి, CI శ్రీనివాస్ రావు, సివిల్ సప్లై డిప్యూటీ తాసిల్దార్ రవి రాథోడ్ పాల్గొన్నారు.

## దాతృత్వం చాటుకున్న పబ్బు రాజు గౌడ్

- **అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ నాయకుడికి రూ.20 వేల ఆర్థిక సాయం**



**చౌటుప్పల్, విశాల భారతి:** మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు మునుగోడు నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్. చౌటుప్పల్ మండలం ఎస్.లింగోటం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కందగట్ల వెంకటాద్రి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం మునుగోడు గౌరవ శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి వెళ్లగా, వారు వెంటనే నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్ కి తెలియజేశారు. దీనిపై వెంటనే స్పందించిన పబ్బు రాజు గౌడ్ మానవతా దృక్పథంతో రూ.20,000 ఆర్థిక సాయాన్ని అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు ఆపద సమయంలో అండగా నిలవడం ప్రతి నాయకుడి బాధ్యత అని అన్నారు. కార్యకర్తల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, బ్లాక్, మండల, మున్సిపల్ అధ్యక్షులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి



**చౌటుప్పల్, విశాల భారతి:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతిని చౌటుప్పల్ మున్సిపాలిటీలోని లక్కారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలన స్వర్ణయుగం అని కొనియాడారు. పేద ప్రజల సంక్షేమం కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ, 108, 104 సేవలు, ఫీజు రీయింబర్స్ మెంట్, రైతులకు ఉచిత విద్యుత్, అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు, రేషన్ కార్డులు, పావలా వడ్డీ రుణాలు, ఇందిరమ్మ ఇళ్లు, రెండు రూపాయలకే కిలో బియ్యం వంటి పథకాలతో పాటు నూతన సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మున్సిపాలిటీ చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మార్కెట్ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గోశిక వినయ్, మండల & మున్సిపాలిటీ అధ్యక్షులు బోయ దేవేందర్, కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, వెలగ రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు రామాలయం చైర్మన్ బొబ్బిల్లా మురళి, సర్పంచులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, మార్కెట్ డైరెక్టర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, డీసీసీ కార్యదర్శి, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై వైఎస్ఆర్ కు నివాళులర్పించారు.

## వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన వైఫల్యం

- **ఇచ్చిన ప్రతి హామీ పై బాధ్యత ప్రభుత్వానిదే**
- **సుర్కంటి శ్రీధర్ రెడ్డి ఉపసర్పంచ్ల ఫోరం జిల్లా అధ్యక్షులు**



**చౌటుప్పల్, విశాల భారతి:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా, ప్రభుత్వ మోసపూరిత హామీలకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు మునుగోడు పట్టణంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మందోళ్ల గూడెం గ్రామ ఉపసర్పంచ్, యాదాద్రి భువనగిరి జిల్లా ఉపసర్పంచ్ల ఫోరం అధ్యక్షులు డా. సుర్కంటి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, ఆరు గ్యారంటీలు, 420 హామీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు గడిచినా ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయలేదని తీవ్రంగా విమర్శించారు. రైతుబంధు, రైతు రుణమాఫీ, యూరియా కొరత, పెన్షన్ల చెల్లింపు వంటి అంశాల్లో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, దీంతో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు, అధికారంలోకి వచ్చాక చేస్తున్న పాలనకు పొంతన లేదని అన్నారు. ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని, ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, హామీల అమలుపై ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని డా. శ్రీధర్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని, ప్రభుత్వం దిగివచ్చే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మానే రవికుమార్, మాజీ సర్పంచ్ బక్క శంకరయ్య, మాజీ ఉపసర్పంచ్ బోరం ప్రకాష్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు ఇట్టబోయిన శంకరయ్య, పాపగల రామచంద్రం, కళ్లెం రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై నేటి నుంచి బీఆర్ఎస్ పోరుబాట



**420 మీటర్ల ఫ్లెక్సీ తో భారీ ర్యాలీ**

**మేడిపల్లి విశాల భారతి**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమం పీర్జాదిగూడలో ఘనంగా జరిగింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు.. మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎన్నికల హామీలను ప్రజలకు మరోసారి గుర్తు చేస్తూ 420 మీటర్ల భారీ ఫ్లెక్సీతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాల్సిన హామీలు, బాకీగా ఉన్న హామీలను వివరిస్తూ బాకీ కార్డులు, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో తాగునీరు, విద్యుత్ వంటి కనీస అవసరాల విషయంలో కూడా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, పథకాల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని తెలిపారు. మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ..420 హామీలను ప్రజల ముందుంచి.. వాటి అమలు పరిస్థితిని ప్రజలకు వివరించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నేటి నుంచి రాబోయే ఏడు రోజుల పాటు పోరు బాట రోజుకొక నిరసన కార్యక్రమం నిర్వహించి.. ప్రభుత్వంపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, మధుసూదన్ రెడ్డి, కౌడే పోచయ్య, మహిళా అధ్యక్షురాలు నిర్మల, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, యూత్ అధ్యక్షులు ప్రభు, జావీద్ ఖాన్, శ్యామల శ్రీనివాస్, UBA అధ్యక్షులు ఆకుల సత్యనారాయణతో డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహానేత డాక్టర్ వై యస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి

- **ఘన నివాళులు అర్పించిన - కీసర సంతోష్ రెడ్డి**



**మోతె సెప్టెంబర్ 2 విశాల భారతి :** బుధవారం మాజీ ముఖ్యమంత్రి మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూలతో ఘన నివాళులు అర్పించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి మాట్లాడుతు వైఎస్సార్ సేవలను, పేదలు-రైతుల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషిని, ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన ఆయన నాయకత్వాన్ని స్మరించుకున్నారు పేదల పక్షపాతిగా, రైతు బాంధవుడిగా, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన మహానేత వైఎస్సార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. అనంతరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి 3వ సారి ఎన్నికైన సందర్భంగా మోతె గ్రామ కాంగ్రెస్ నూతన కమిటీ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పందిళ్లపల్లి పుల్లారావు, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ముదిరెడ్డి మధుసూదన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు వెలుగు వీరన్న, గ్రామశాఖ అధ్యక్షులు నిమ్మనగోటి శ్రీకాంత్, మండల నాయకులు గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాళ్లగూడ వద్ద ఓఆర్ఆర్ పై నుంచి కిందపడిన సిమెంట్ లారీ

**డ్రైవర్‌కు గాయాలు.. ఆస్పత్రిలో చికిత్స.. తప్పిన ప్రాణనష్టం**





**రాజేంద్రనగర్, విశాల భారతి:** రాళ్లగూడ సమీపంలో ఔటర్ రింగ్ రోడ్డుపై ( ఓఆర్ఆర్ ) బుధవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి ORRపై నుంచి కిందపడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు రక్తగాయాలయ్యాయి. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. పోలీసుల వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం 6.30 గంటల సమయంలో డయల్ 100కు రాళ్లగూడ సమీపంలో లారీ ఓఆర్ఆర్ పై నుంచి కిందపడినట్లు సమాచారం అందింది. వెంటనే ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పెట్రోలింగ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కోదాడ నుంచి తుల్జాపూర్‌కు సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న TG29T3688 నంబర్ గల లారీ అదుపుతప్పి ఓఆర్ఆర్ పై నుంచి కిందపడినట్లు గుర్తించారు. ప్రమాదంలో లారీ డ్రైవర్ ఎల్లయ్య (40)కు గాయాలు కావడంతో పోలీసు సిబ్బంది 108 అంబులెన్స్ ద్వారా సమీపంలోని ట్రైడెంట్ ఆస్పత్రికి తరలించి చికిత్స కోసం చేర్పించారు. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటం వల్ల వాహనంపై నియంత్రణ కోల్పోయి ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనపై ఆర్జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి ఖచ్చితమైన కారణాలను విచారణ అనంతరం వెల్లడిస్తామని తెలిపారు.

## రాహుల్ గాంధీపై అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలి : కాంగ్రెస్ నిరసన ర్యాలీ




**సికింద్రాబాద్, విశాల భారతి :** ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై అక్రమంగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్ నేతృత్వంలో ఎంజీ రోడ్డులోని గాంధీ విగ్రహం నుంచి బాంబే హోటల్ చౌరస్తా వరకు కాంగ్రెస్ శ్రేణులు ర్యాలీ చేపట్టాయి. బీజేపీ అనుసరిస్తున్న కుల వివక్ష, కక్షసాధింపు రాజకీయాలకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్ మాట్లాడుతూ..ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రసంగించిన సభా వేదికను గంగాజలంతో 'శుద్ధి' చేసిన బీజేపీ, ఆర్ఎస్ఎస్ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినందుకే రాహుల్ గాంధీపై తప్పుడు కేసులు బనాయించారని మండిపడ్డారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధించడం బీజేపీ కుటిల, కులతత్వ మనస్తత్వానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. దళితులు, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడే వారిని అణచివేసేందుకు కేంద్రం దర్యాప్తు సంస్థలను, ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయంపై జరుగుతున్న దాడులను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని దీపక్ జాన్ స్పష్టం చేశారు. ఖర్గేను అవమానించిన అసలు నిందితులపై చర్యలు తీసుకోకుండా, నిరాధారమైన ఎఫ్ఐఆర్‌లతో రాహుల్ గాంధీని వేధించాలనుకోవడం బీజేపీ అహంకారానికి పరాకాష్ట అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీపై మోపిన కేసులను రద్దు చేసేవరకు, నిందితులకు శిక్ష పడేవరకు తమ పోరాటం ఆగదని ఆయన తేల్చిచెప్పారు. ఈ ఆందోళన కార్యక్రమంలో ఎమ్మెల్యే నవీన్ యాదవ్, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ కోట నీలిమ, అరవింద్ కుమార్ యాదవ్‌లతో పాటు డివిజన్ అధ్యక్షులు, డీసీసీ కార్యవర్గ సభ్యులు, సీనియర్ నేతలు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించకపోతే సరఫరా బంద్

**ఆస్పత్రుల సరఫరాదారుల సంఘం హెచ్చరిక**

**సికింద్రాబాద్, విశాల భారతి :** రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రులకు రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద సరఫరా చేసే అత్యవసర ఔషధాలు, సర్జికల్స్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్విన్ సిటీస్ హాస్పిటల్స్ సప్లయర్స్ అసోసియేషన్ స్పష్టం చేసింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)కి అధికారికంగా లేఖ అందజేశారు. ప్రభుత్వం నుంచి తమకు రావాల్సిన ఆరోగ్యశ్రీ బిల్లులను వెంటనే విడుదల చేయాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు చెల్లించే వరకు ఉస్మానియా, గాంధీ తదితర ప్రభుత్వ ఆస్పత్రులకు సూపర్ స్పెషాలిటీ మందులు, సర్జికల్ పరికరాల సరఫరాను నిలిపివేస్తున్నామని తేల్చిచెప్పారు. ఇప్పటికే క్యాథ్ ల్యాబ్ స్టెంట్లు, ఇతర అనుబంధ పరికరాల సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేసిన విషయాన్ని లేఖలో గుర్తుచేశారు. గత ఎనిమిది నెలలుగా ఆరోగ్యశ్రీ సిబ్బందికి జీతాలు అందడం లేదని ప్రతిపక్ష నేత హరీశ్ రావు చేసిన ప్రకటనను ప్రస్తావిస్తూ, మరోవైపు ప్రభుత్వ సంస్థలన్నింటికీ నిధులు చెల్లిస్తున్నామని ఆరోగ్యశ్రీ సీఈవో ప్రకటన ఇవ్వడం తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని అసోసియేషన్ పేర్కొంది. గత రెండేళ్లుగా వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి ఆరోగ్యశ్రీ కింద సరఫరాదారులకు పైసా కూడా చెల్లించలేదని వారు ఆరోపించారు. నిలిచిపోయిన బిల్లులను తక్షణమే విడుదల చేయాలని, అప్పటివరకు ఆరోగ్యశ్రీ విభాగాలకు అన్ని రకాల సరఫరాలను నిలిపివేస్తున్నామని హెచ్చరించారు. ఈ అంశంపై సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ లేఖ ప్రతులను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రికి, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోకు, ప్రిన్సిపల్ సెక్రటరీకి అందజేశారు.

# సైబర్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

- చదువుపై పూర్తి దృష్టి సారించాలి.. మొబైల్ వినియోగంలో నియంత్రణ అవసరం
- వైఫల్యాలకు కుంగిపోవద్దు.. పట్టుదలతో లక్ష్యాన్ని సాధించాలి
- సమస్యలను దాచుకోవద్దు.. ధైర్యంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులకు చెప్పాలి
- గణేష్ ఉత్సవాల్లో నకిలీ విరాళాలు, అనుమానాస్పద సంకేతాల పట్ల జాగ్రత్త: జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:**

విద్యార్థులు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని తమ భవిష్యత్తు అభివృద్ధికి ఉపయోగించుకోవాలని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ సూచించారు. విద్యార్థి దశలో చదువే ప్రధాన లక్ష్యంగా ఉండాలని, అవసరానికి మించి చరవాణిని వినియోగించడం వల్ల చదువు, ఏకాగ్రత, భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. మహబూబాబాద్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మహబూబాబాద్ గ్రామీణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముత్యాలమ్మ గూడెం ప్రభుత్వ గిరిజన బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు సైబర్ నేరాలు, చరవాణి వినియోగం, వ్యక్తిగత భద్రత, విద్యాభ్యాసం, భవిష్యత్తు లక్ష్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థినులతో నేరుగా మాట్లాడారు. వారి సందేహాలను తెలుసుకుని పలు అంశాలపై అవగాహన కల్పించారు.

**చదువును పక్కనపెట్టి చరవాణికి బానిసలు కావొద్దు.**

చరవాణి ప్రస్తుతం ప్రతి ఒక్కరి జీవితంలో ముఖ్యమైన సాధనంగా మారిందని, అయితే దానిని అవసరానికి మించి వినియోగిస్తే విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఎస్పీ తెలిపారు. సామాజిక మాధ్యమాలు, చిన్నచిత్రాలు, అనవసరమైన ఆటలు చూస్తూ విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. చరవాణిని జ్ఞానాన్ని పెంచుకునేందుకు, విద్యకు సంబంధించిన విషయాలను తెలుసుకునేందుకు, కొత్త అంశాలను నేర్చుకునేందుకు మాత్రమే ఎక్కువగా వినియోగించాలని తెలిపారు. విద్యార్థి దశలో సమయం ఎంతో విలువైనదని, ఈ సమయంలో అలవర్చుకునే మంచి పద్ధతులే భవిష్యత్తుకు పునాది అవుతాయని అన్నారు.

**వైఫల్యం విజయానికి తొలి మెట్టు**

జీవితంలో ప్రతి ఒక్కరికీ గెలుపు, ఓటములు సహజమేనని ఎస్పీ శబరీష్ అన్నారు. పరీక్షల్లో లేదా ఇతర విషయాల్లో ఒకసారి విఫలమైనంత మాత్రాన నిరాశ చెందకూడదని సూచించారు. "వైఫల్యం విజయానికి ముగింపు కాదు.. విజయానికి వేసే తొలి అడుగు" అని విద్యార్థులకు ధైర్యం చెప్పారు. వైఫల్యానికి కారణాలను గుర్తించి, వాటి నుంచి పాఠాలు నేర్చుకుని మరింత పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించే వరకు క్రమశిక్షణతో కృషి చేయాలని తెలిపారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొని తమలోని ప్రతిభను వెలికితీయాలని సూచించారు.

**భయపడొద్దు.. సమస్యను బయటకు చెప్పండి**

విద్యార్థినుల వ్యక్తిగత భద్రతపై ఎస్పీ ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఎలాంటి సమస్య ఎదురైనా భయపడి మౌనంగా ఉండవద్దని సూచించారు. "చీకటిలో దాక్కోకండి.. మీ గొంతును వినిపించండి" అని విద్యార్థినులకు ధైర్యం చెప్పారు. ఎవరైనా వేధింపులకు గురిచేసినా, సామాజిక మాధ్యమాల ద్వారా ఇబ్బందులకు గురిచేసినా, బెదిరింపులు ఎదురైనా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. సమస్యను దాచిపెట్టడం వల్ల అది మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని, సరైన సమయంలో నమ్మకమైన వ్యక్తులకు తెలియజేస్తే సమస్యను పరిష్కరించుకోవచ్చని అన్నారు.

**గణేష్ ఉత్సవాల్లో సైబర్ మోసాలపై జాగ్రత్త.**

రానున్న గణేష్ ఉత్సవాల నేపథ్యంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీసు శాఖ రూపొందించిన "సైబర్ విజ్ఞానం కలిగి ఉండండి - వినాయకుడు మనకు నేర్పే పాఠాలు" అవగాహన పోస్టర్‌ను జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఆవిష్కరించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా విరాళాల పేరుతో వచ్చే నకిలీ సంకేత చిత్రాలు, నకిలీ సామాజిక మాధ్యమ ఖాతాలు, అనుమానాస్పద అనుసంధానాలు, నకిలీ అంతర్జాల ఆఫర్ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిచయం లేని వ్యక్తులు పంపించే అనుసంధానాలను తెరవకూడదని, అనుమానాస్పద సందేశాలకు స్పందించకూడదని తెలిపారు.

**రహస్య సమాచారాన్ని ఎవరికీ చెప్పొద్దు.**

బ్యాంకు ఖాతా వివరాలు, ఒకసారి వినియోగించే రహస్య సంఖ్యలు, నగదు కార్డు వివరాలు, సంకేతపదాలు వంటి అత్యంత కీలకమైన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు వెల్లడించకూడదని ఎస్పీ స్పష్టం చేశారు. బ్యాంకు అధికారులు, పోలీసులు లేదా ఇతర అధికారుల పేరుతో ఎవరైనా ఫోన్ చేసి రహస్య వివరాలు అడిగినా ఇవ్వకూడదని హెచ్చరించారు. బహుమతి వచ్చిందని, నగదు గెలుచుకున్నారని, ఖాతా నిలిపివేస్తామని, తక్షణమే వివరాలు చెప్పాలని ఎవరైనా ఒత్తిడి చేసినా నమ్మవద్దని సూచించారు. సైబర్ నేరగాళ్లు కొత్తకొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

**మోసానికి గురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలి.**

సైబర్ మోసానికి గురైన వారు భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని ఎస్పీ తెలిపారు. మోసం జరిగిన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ నేరాల సహాయవాణికి ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. మోసానికి సంబంధించిన ఫోన్ నంబర్లు, సందేశాలు, లావాదేవీల వివరాలు, ఇతర ఆధారాలను భద్రపరచుకోవాలని తెలిపారు.

**విద్యార్థుల సందేహాలకు ఎస్పీ సమాధానాలు.**

అనంతరం ఎస్పీ డాక్టర్ శబరీష్ విద్యార్థినులతో నేరుగా మాట్లాడి వారి సందేహాలను తెలుసుకున్నారు. సైబర్ నేరాల నుంచి ఎలా రక్షించుకోవాలి, చరవాణిని ఎలా సురక్షితంగా వినియోగించాలి, వ్యక్తిగత భద్రత విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, చదువుపై ఏకాగ్రతను ఎలా పెంచుకోవాలి తదితర అంశాలపై విద్యార్థినులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. విద్యార్థులు ఎలాంటి సమస్య ఎదురైనా పోలీసు శాఖను సంప్రదించడానికి వెనుకాడవద్దని తెలిపారు. విద్యార్థుల భద్రతకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని, మంచి లక్ష్యాలను ఏర్పరుచుకుని సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, మహబూబాబాద్ గ్రామీణ సీఐ అంజలి, పోలీసు అధికారులు, సైబర్ విభాగం సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# నోటీసులు అందుకున్న వారు హాజరు కావాలి

- సెప్టెంబర్ 5, 6 తేదీలలో ప్రత్యేక మెగా హియరింగ్
- అవసరమైన ఆధార పత్రాలతో హాజరు కావాలి
- జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి



**విశాలభారతి ఇబ్రహీంపట్నం :** రంగారెడ్డి జిల్లాలో సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో భాగంగా నోటీసులు జారీ చేసిన కేసులకు సంబంధించి సెప్టెంబర్ 5, 6 తేదీలలో సర్ మెగా హియరింగ్ ప్రక్రియను నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు. సర్ ప్రక్రియలో భాగంగా సంబంధిత ఓటర్లకు ఇప్పటికే నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో, నోటీసులు అందుకున్న ప్రతి వ్యక్తి తమ నోటీసులో పేర్కొన్న తేదీ, సమయం, హియరింగ్ కేంద్రానికి తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా ఎన్నికల అధికారి సూచించారు. హియరింగ్‌కు హాజరై తమకు సంబంధించిన అభ్యంతరాలు, వివరణలు, వాదనలు, అవసరమైన వివరాలను సంబంధిత అధికారుల ముందు సమర్పించుకోవాలని తెలిపారు. తప్పనిసరిగా తీసుకురావాల్సిన పత్రాలు హియరింగ్‌కు హాజరయ్యే వారు క్రింది పత్రాలను తమ వెంట తీసుకురావాలని జిల్లా ఎన్నికల అధికారి సూచించారు. నోటీసు అందుకున్న ప్రతి వ్యక్తి ఈ నెల 5 తేదీ మరియు 6వ తేదీల్లో నిర్వహించే మెగా హియరింగ్‌ను సద్వినియోగం చేసుకుని, సర్ ప్రక్రియకు అవసరమైన సహకారం అందించాలని ఆయన కోరారు.

# ఆజాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బహుమతుల ప్రధానం

- ఫౌండేషన్ అధ్యక్షులు సంతోష్ గుప్తా



**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** ఆజాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత నెలలో 15 ఆగస్టు సందర్భంగా మన ఆజాద్ ఫౌండేషన్ యాచారం మండల కేంద్రంలోని గవర్నమెంట్ హై స్కూల్లో వ్యాసరచన పోటీ నిర్వహించారు.ఆ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు విద్యార్థులకు బుధవారం బహుమతి ప్రధానోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థిని విద్యార్థులు ఒక సబ్జెక్టులోనే కాకుండా ఏదైనా వ్యాసరచన పోటీ పోటీ పెడితే అందరూ పోటీపడేలా చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ తలారి మహేందర్ గవర్నమెంట్ హై స్కూల్ ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా వైయస్ఆర్ 7వ వర్ధంతి వేడుకలు



**విశాలభారతి ఇబ్రహీంపట్నం :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్వర్గీయ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా ఇబ్రహీంపట్నం మండలం వైయస్సార్ పోకల్ కార్ హరినారాయణ జి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం చెరువుకట్ట పైన ఉన్న వైయస్సార్ విగ్రహానికి పూలమాలవేసి వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఇబ్రహీంప ట్నం నియోజకవర్గం వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్వర్గీయ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన ఏకైక గొప్ప ముఖ్యమంత్రి స్వ ర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని అన్నారు. ముఖ్యంగా పేద ప్రజల కోసం ఇందిరమ్మ ఇండ్లు రాజీవ్ ఆరోగ్యశ్రీ 108 వైద్య సేవలురైతుల కోసం ఉచిత విద్యుత్ రుణమాఫీ విద్యార్థుల కోసంఫీజు రియంబర్స్మెంట్ మహిళా సంఘాలకు పావులా వడ్డీకి రుణాలు ఇంకా ఎన్నోసంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఇప్పటికీ తెలంగాణ రాష్ట్రంలో ప్రతి పేదవాడి గుండెల్లో గూడుకట్టుకున్న గొప్పముఖ్య మంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోఆనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలనే పేరు మార్చి అమలు చేస్తున్నారు తప్ప కొత్తగా ప్రవేశపెట్టిన పథకాలు ఏమీ లేవు అని అన్నారు. స్వర్గీయ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖ ర్ రెడ్డి పాలనలో ముఖ్యంగా పేద విద్యార్థులకు ప్రవేశ పెట్టిన ఫీజు రియంబర్స్మెంట్ పథకం ప్రతి ఏడాది క్రమం తప్పకుండా ఫీజు రియంబర్స్మెంట్ డబ్బులు మంజూరు అయ్యేవి నేటి ప్ర భుత్వాలు ఫీజు రియంబర్స్మెంట్ డబ్బులు చెల్లింపు ప్రతి ఏడాది సక్రమంగా చెల్లించక పోవడంతో ప్రవేట్ కాలేజీల యాజమాన్యాలు ఫీజు డబ్బులు కట్టాలని విద్యార్థులను నానా ఇబ్బందులకు గురి చేస్తూ పేద విద్యార్థుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నారని అన్నారు. ఈనాడు ప్రతిపేద విద్యార్థి ఆనాడు వైయస్సార్ పాలన గురించి గుర్తు చేసుకుంటున్నారని అన్నారు ఇప్పటికైనా ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ప్రవేట్ కాలేజీలలో చదువుకునే పేద విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయకుండా పెండింగ్ లో ఉన్న ఫీజురియం బర్స్మెంట్ డబ్బులు వెంటనే కాలేజ్ యజమాన్యాలకు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాచారం మండలం వైయస్సార్ పంది జయరాజ్ జోగు శ్రీకాంత్ మైనార్టీ నాయకుడు మ హమ్మద్ అష్రఫ్ మురళి తదితరు లు పాల్గొన్నారు.

# అతిథి అధ్యాపక నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

- కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్. రాధిక




**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నం నందు 2026 27 విద్యా సంవత్సరానికి గాను క్రాప్ ప్రొడక్షన్ సబ్జెక్టు అతిథి అధ్యాపక ఎంపిక కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్. రాధిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ పీజీ సబ్జెక్టులలో జనరల్ వారు 55 శాతం, ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు కలిగి ఉండాలి. పీహెచ్.డీ, నెట్, సెట్, కలిగిన వారికి, బోధనా అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఎంపికైన అభ్యర్థులకు బయోమెట్రిక్ అటెండెన్స్ ప్రకారం వేతనం లభిస్తుంది. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 5 వ తేదీ శనివారం సాయంత్రం 4.00 గంటల లోపు కళాశాల కార్యాలయంలో ఇవ్వగలరు. ఇతర వివరాలకు 8374939833 అకాడమీ కోఆర్డినేటర్ మొబైల్ నెంబర్ కు సంప్రదించగలరని అన్నారు

# ఓటరు నోటీసుల పరిష్కార కేంద్రాలను పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి: సుదర్శన్ రెడ్డి




**రాజేంద్రనగర్,విశాల భారతి :** రాజేంద్రనగర్ జోన్ పరిధిలో ఓటరు నోటీసుల పరిష్కార ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి పరిశీలించారు. బండ్లగూడ, హైదర్షాకోట్, శివరాంపల్లి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఓటరు నోటీసుల పరిష్కార కేంద్రాలను ఆయన సందర్శించి, అక్కడ కొనసాగుతున్న ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. కేంద్రాలకు వచ్చిన ఓటర్లతో సుదర్శన్ రెడ్డి నేరుగా మాట్లాడారు. ఓటర్లకు అందిన నోటీసుల వివరాలు, వారి ఓటరు జాబితా నమోదుకు సంబంధించిన అంశాలు, నోటీసులకు సమాధానాలు ఇచ్చే సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. ఓటర్లు తమకు సంబంధించిన వివరాలను జాగ్రత్తగా పరిశీలించుకోవాలని, అవసరమైన పత్రాలను సమర్పించి తమ అభ్యంతరాలు, వివరణలను నిర్ణీత విధానంలో నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం నోటీసుల పరిష్కార కేంద్రాల్లో అధికారులు, సిబ్బంది చేపడుతున్న చర్యలను సీఈఓ పరిశీలించారు. కేంద్రాలకు వచ్చే ప్రతి ఓటరుకు సరైన సమాచారం అందించాలని, వారి సందేహాలను నివృత్తి చేసి ప్రక్రియపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాతంగా వ్యవహరించడం అత్యంత కీలకమని సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. అర్హత కలిగిన ఓటర్ల వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా, నిబంధనలకు అనుగుణంగా నోటీసుల పరిష్కారం జరిగేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బండ్లగూడ, హైదర్షాకోట్, శివరాంపల్లి ప్రాంతాల్లోని కేంద్రాల్లో జరుగుతున్న పనితీరును పరిశీలించిన అనంతరం సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించి, పెండింగ్‌లో ఉన్న నోటీసుల పరిష్కారంపై వివరాలు తెలుసుకున్నారు. ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు.

# వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి కాంగ్రెస్ నేతల నివాళి

**మొయినాబాద్ సెప్టెంబర్ 2 (విశాలభారతి):** దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకుని మొయినాబాద్ మండలంలోని జేబీఐటీ-అప్పాపూర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొలిగిద్ద సత్యనారాయణ, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, మాజీ మండల అధ్యక్షుడు తమ్మలి మానయ్య, నాయకులు మాడి వెంకట్‌రెడ్డి, చేగూరి రామకృష్ణగౌడ్, బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం



**మొయినాబాద్ సెప్టెంబర్ 2(విశాలభారతి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మొయినాబాద్‌లో బుధవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. పార్టీ అధినేత కేసీఆర్ పిలుపు, చేవెళ్ల మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు కార్యక్రమం చేపట్టినట్లు నాయకులు తెలిపారు. మొయినాబాద్ చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలతో పాటు ఇతర హామీలను కూడా నెరవేర్చాలని డిమాండ్ చేశారు.ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వారాసిగూడలో ప్రమాదకరంగా మారిన మ్యాన్ హోల్ పరిశీలన



**సికింద్రాబాద్, విశాల భారతి :** ఇందిరా నగర్ కాలనీ రోడ్ నంబర్ 5 లో రోడ్డుపై మ్యానోహోల్ ప్రమాదకరంగా మారింది. వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో స్థానిక బస్తీ వాసులు ఈ సమస్యను మాజీ కార్పొరేటర్ అదం విజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. బస్తీవాసుల వినతిపై ఆయన స్పందించారు. జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. జీహెచ్ఎంసీ ఏఈ వేణు, వాటర్ వర్క్స్ మేనేజర్ కుషాల్ లు ఆ ప్రాంతంలో పర్యటించి సమస్యను పరిశీలించారు . వాహనదారులకు ఇబ్బంది లేకుండా త్వరలోనే ఈ సమస్య పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నామాల గుండు వీరాంజనేయ స్వామి ఆలయ సభ్యులు బేతాళా నరేష్, బస్తీ వాసులు రాము, సుధీర్, జగన్ ఎద్దుల పాల్గొన్నారు.

# నోములకు సన్మానం



**సికింద్రాబాద్, విశాల భారతి :** న్యూక్లబ్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా గెలుపొందిన నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయం చైర్మన్ నోముల ప్రకాశ్ ను పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. న్యూ క్లబ్ అధ్యక్షుడిగా మూడోసారి ఆయన గెలుపొందినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నామాల గుండు వీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యుడు బేతాళ నరేష్, గంగాళం రాము తదితరులు పాల్గొన్నారు.

# జీఓ 60 ప్రకారం రూ.15,600 వేతనం చెల్లించాలి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు సిఐటియు వినతి

**భద్రాద్రి ప్రతినిధి :విశాలభారతి**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పీఎంహెచ్ హాస్టళ్లలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ వర్కర్లకు జీఓ నెం.60 ప్రకారం రూ.15,600 వేతనం చెల్లించాలని కోరుతూ తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ జాబ్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మచారి ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుని కలిసి వినతి పత్రం అందజేశారు.రాష్ట్ర ప్రభుత్వం 2025లో విడుదల చేసిన కాంట్రాక్ట్ జాబ్ సోర్సింగ్ పోస్టుల్లో 60 పోస్టులు కేటాయించినప్పటికీ, ఇప్పటివరకు పీఎంహెచ్ హాస్టళ్లలో పనిచేస్తున్న వర్కర్లతో ఆ పోస్టులను సర్దుబాటు చేయలేదని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఫలితంగా 2026లో జీఓ ఆర్డర్ నెం.1348 ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు 30 జాబ్ సోర్సింగ్ పోస్టులు కేటాయించారని 2025తోపోలిస్తే 30పోస్టులు నష్టపోయారని తెలిపారు.2026పోస్టులుకూడా ఇప్పటివరు సద్వినియోగం చేయలేదని వెంటనే సద్వినియోగం చేసేవిధంగా ఐటీడీఏ పిఓ కి చెప్పాలని కోరారు.జీఓ నెం.60ప్రకారం రూ.15,600వేతనం చెల్లించాల్సి ఉండగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో క్యాటరింగ్ విధానంలో కేవలం రూ.10,070 మాత్రమే చెల్లిస్తున్నారని, దీంతో హాస్టల్ వర్కర్లు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.జీఓ నెం.1348 ప్రకారం మంజూరైన 30 పోస్టులకు సీనియారిటీ ప్రాతిపదికన అర్హులైన వర్కర్లను ఎంపిక చేసి, వారికి రూ.15,600 వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మిగిలిన వర్కర్ల కోసం అదనపు జాబ్ సోర్సింగ్ పోస్టులు మంజూరు చేయించి, వారందరికీ జీఓ నెం.60 ప్రకారం వేతనాలు అందేలా ప్రభుత్వానికి లేఖ రాయాలని విజ్ఞప్తి చేశారు.వర్కర్ల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గారు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సాంబశివరావు మణుగూరు పి ఎం హెచ్ హాస్టల్ వర్కర్ స్వరూప,పి. భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కే.ఎస్. రత్నంకు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు



**రాజేంద్రనగర్, విశాల భారతి :** చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కే.ఎస్. రత్నం జన్మదిన వేడుకలు బుధవారం ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి కే.ఎస్. రత్నం నివాసానికి చేరుకుని ఆయనను ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి, పూలమాలలు వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ కే.ఎస్. రత్నం ప్రజలతో మమేకమై పనిచేసే నాయకుడిగా, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో మరింత కాలం కొనసాగుతూ ప్రజలకు సేవలందించాలని కోరుకున్నారు. జన్మదిన వేడుకల సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కే.ఎస్. రత్నంకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దీంతో ఆయన నివాసంలో సందడి వాతావరణం నెలకొంది.

# కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయి పట్టివేత

- భార్యాభర్తలు అదుపులోకి తీసుకున్న పోలీసులు
- పట్టుకున్న గంజాయి విలువ రూ.20 లక్షల ఉంటుందన్న డి.ఎస్.పి

**అశ్వాపురం, విశాల భారతి :** కారులో అక్రమంగా తరలిస్తున్న 40 కిలోల 560 గ్రాముల గంజాయిని విశ్వసనీయ సమాచారం మేరకు అశ్వాపురం ఎస్సై రాజేష్ సిబ్బందితో కలిసి గొల్లగూడెం కెనాల్ వద్ద పట్టుకున్నారు. గంజాయి తరలిస్తున్న ఓడి 30 ఈ 0342 నెంబర్ గల కారుతోపాటు భార్య భర్తలు ఇద్దరినీ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. బుధవారం మణుగూరు డిఎస్పి వంగా రవీందర్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ గంజాయి తరలిస్తున్న ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా కలిమెలకు చెందిన అరబిందో బిశ్వాస్ అతని భార్య సుప్రియ బిశ్వాస్ లను అదుపులోకి తీసుకునామన్నారు. గంజాయిని వారు షిర్డీకి తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు ఆయన తెలిపారు. ఎస్ఐ రాజేష్ ఫిర్యాదు మేరకు అశ్వాపురం సీఐ ఎల్లయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మణుగూరు డీఎస్పీ హెచ్చరించారు.



విశాల భారతి
CINEMA

# కాంగ్రెస్ 33 నెలల వైఫల్యాలపై బీఆర్ఎస్ సమరభేరి

- 420 హామీల్లో ఎన్ని అమలు చేశారు.. ప్రజలకు ఇచ్చిన మాట ఎక్కడ..?
- మహబూబాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ధర్నా
- ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్ నాయకులు షేక్ ఖాదర్ బాబా



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సమరభేరి మోగింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 33 నెలలు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో అనేకం ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని బీఆర్ఎస్ నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తూ భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రజలకు పెద్ద ఎత్తున హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం ఆ హామీల అమలుపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ముఖ్యంగా 420 హామీలను ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఎన్ని హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసిందో ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హామీల అమలుపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు.

**ఎంఆర్ఓ కార్యాలయం వద్ద నిరసన.**

బీఆర్ఎస్ చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్ జిల్లా ఎంఆర్ఓ కార్యాలయం వద్ద భారీ ధర్నా చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును ప్రశ్నిస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.

**ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి.**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు కేవలం ఓట్లు సాధించేందుకు ఇచ్చిన మాటలుగా మిగిలిపోవద్దని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా హామీల అమలులో జాప్యం ఎందుకు జరుగుతోందో ప్రభుత్వం ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు, పేదలు, సామాన్య ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వం హామీల అమలుపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించి, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్ శ్రేణులు డిమాండ్ చేశాయి. ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకలను ఎవరూ అణచలేరని, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

**ఖాదర్ బాబా పాల్గొనడం.**

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ర్యాలీ, ధర్నా కార్యక్రమంలో బెతోలు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఖాదర్ బాబా పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

**జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణుల కదలిక.**

బీఆర్ఎస్ సమరభేరి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలిరావడంతో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. భారీ ర్యాలీగా ఎంఆర్ఓ కార్యాలయం వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ శ్రేణులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేయకుండా ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసి ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. హామీల అమలుపై ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే భవిష్యత్తులో మరింత ఉధృతంగా ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని ప్రశ్నించడం బీఆర్ఎస్ బాధ్యత అని, హామీల అమలు కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# ఎన్నికైన ప్రెస్ క్లబ్ కమిటీ అభినందనలు తెలిపిన తుళ్లూరి బ్రహ్మయ్య

- పారదర్శకంగా వార్త కథనాలు రాయాలి



**అశ్వాపురం, విశాల భారతి :** అశ్వాపురం మండల నవ చైతన్య ప్రెస్ క్లబ్ ఏర్పాటు అనంతరం బుధవారం మండల కేంద్రంలోని తుళ్లూరి బ్రహ్మయ్య గారి క్యాంపు కార్యాలయంలో ఆయనను నూతన ప్రెస్ క్లబ్ కమిటీ మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. తొలుత ప్రెస్ క్లబ్ కు ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులను అభినందించిన ఆయన మిఠాయిలు పిలిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన ప్రెస్ క్లబ్ లోని విలేకరులంతా సమాజ హితం కోసం పారదర్శకంగా వ్యవహరిస్తూ వార్తలు ప్రచురించాలని ఆయన తెలిపారు. ప్రస్తుత సమాజంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమైందని ప్రభుత్వానికి ప్రజలకు ఉంటున్న ఫోర్త్ ఎస్టేట్ ప్రాముఖ్యత ఎంతో ప్రాధాన్యమైందని ఆయన అన్నారు. ప్రెస్ క్లబ్ కు తన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. బ్రహ్మన్నను కలిసిన వారిలో నవచైతన్య ప్రెస్ క్లబ్ బ్ కమిటీ గౌరవ అధ్యక్షుడు కుందూరు శ్రీనివాస్ రెడ్డి, గౌరవ సలహాదారు తునికేసి సురేందర్ రెడ్డి, కోశాధికారి ఎస్కే ఖదీర్, ఉపాధ్యక్షులు కత్తెరం వెంకటరమణారెడ్డి, పగడాల వెంకటరెడ్డి, సహాయ కార్యదర్శి గరికపాటి అంజన్ రావు, మండల విజయ్ కుమార్, కానూరి రాంబాబు, అలవాల నాగరాజు లు ఉన్నారు.

# పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు.. బిర్యానీ పొట్లాల పంపిణీ

పాల్వంచ విశాల భారతి: జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని పాల్వంచలో జనసేన పార్టీ నాయకులు, అభిమానులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ కొత్తగూడెం నియోజకవర్గ యూత్ లీడర్, సోషల్ మీడియా సెక్రటరీ షేక్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో బిర్యానీ పొట్లాలను పంపిణీ చేశారు. ప్రజలకు బిర్యానీ పొట్లాలు అందిస్తూ పవన్ కళ్యాణ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ వీరాభిమాని, సోషల్ మీడియా టీం సభ్యుడు సాయి తేజ, మెగా ఫ్యాన్స్ అధ్యక్షుడు కాసిం, పవన్ కళ్యాణ్ అభిమానులు పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు మంజూర్ గారి చేతుల మీదుగా కూడా బిర్యానీ పొట్లాలను పంపిణీ చేశారు. అలాగే జనసేన పార్టీ పాల్వంచ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. పవన్ కళ్యాణ్ సేవా స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లే విధంగా ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు.

# ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

**పాల్వంచ, విశాలభారతి :** పాల్వంచ పట్టణంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఇందిరా కాలనీలోని బ్రహ్మంగారి దేవాలయ ప్రాంగణంలో అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద జనసేన నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు ఆసుపత్రి సూపరింటెండెంట్ ముక్కంటేశ్వరరావు చేతుల మీదుగా పండ్లు, బ్రెడ్, పాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పాల్వంచ మెగా ఫ్యాన్స్ అధ్యక్షుడు ఖాసీం మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని, ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. రాజకీయంగా మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. తెలంగాణలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసేందుకు పాల్వంచ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ ముందుంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్వంచ మండల అధ్యక్షుడు దేవాగౌడ్, టౌన్ ప్రెసిడెంట్ బ్రహ్మం, పవన్ కళ్యాణ్ వీరాభిమాని సింహాచలం, ముత్తినేని శ్రీను, మెగా ఫ్యాన్స్ అధ్యక్షుడు ఖాసీం, సాంబ, సంపత్, రామ్ వర్మ, గురు, సాయి శ్రావణ్, సాయి తేజ, ప్రసాద్, వీరమహిళ సరోజిని, రమేష్, బాలాజీ, మీరావలీ, భాషా, మీరా తదితరులు పాల్గొన్నారు.





# త్రిష కొత్త చిత్రం

రాజకీయపరమైన అంశాలకు దూరంగా అగ్ర కథానాయిక త్రిష ప్రస్తుతం సినిమాలపై దృష్టిపెడుతున్నది. తమిళనాడు సీఎం విజయ్‌తో ఉన్న సాన్నిహిత్యం కారణంగా ఈ భామ పేరు తరచూ పొలిటికల్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. ఈ నేపథ్యంలో త్రిష కొత్త చిత్రం బుధవారం ప్రారంభమైంది. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నిర్మాణ సంస్థ పనోరమా స్టూడియో తమిళ ఫిల్మ్‌ప్రొడక్షన్‌లోకి అడుగుపెడుతున్నది. 'ఎయిర్‌లిఫ్ట్' చిత్రంతో గుర్తింపు పొందిన రాజాకృష్ణ మీనన్ ఈ చిత్రానికి దర్శకుడు. సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌గా తెరకెక్కబోతున్న ఈ సినిమాలో త్రిష పాత్ర గత చిత్రాలకు పూర్తి భిన్నంగా ఉంటుందని చెబుతున్నారు. ఇందులో రాధికా శరత్‌కుమార్, అపర్ణ బాలమురళి కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.